# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 163

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy   సంపాదకులు : కె.భాస్కర్‌రావు   రూ.2.00/- పేజీలు 8   తేది: బుధవారం 08 జూలై 2026




ప్రధాని మోదీకి ఇండోనేసియా అత్యున్నత పౌర పురస్కారం

2వ పేజీలో...



## సింగూర్ అవుట్.. ముఖర్జీ ఇన్..

**సమయం ప్రతినిధి:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి రాష్ట్ర పాఠ్యపుస్తకాల విషయంలో కీలక ప్రతిపాదన చేశారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవితం, దేశానికి ఆయన చేసిన సేవలను పాఠశాల సిలబస్‌లో చేర్చాలని సూచించారు. అదే సమయంలో సింగూర్ ఉద్యమానికి సంబంధించిన పాఠాలను సిలబస్ నుంచి తొలగించాలని కూడా అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. కోల్‌కతాలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సువేందు మాట్లాడారు. 'సిలబస్‌ను రాజకీయ నాయకులు నిర్ణయించరు. కానీ ప్రజాప్రతినిధిగా నేను ఒక ప్రతిపాదన చేయవచ్చు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశభక్తి, పశ్చిమ బెంగాల్ ఏర్పాటులో ఆయన పాత్ర, అవిభాజ్య భారతదేశంపై ఆయన ఆలోచనలు, పార్లమెంట్ ప్రసంగాలు, కేంద్ర మంత్రిగా, కలకత్తా విశ్వవిద్యాలయానికి వీసీగా ఆయన అందించిన సేవలను విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది' అని సువేందు పేర్కొన్నారు.



## రాముడి కానుకలు సేఫ్..

**సమయం ప్రతినిధి:** అయోధ్య రామమందిరానికి భక్తులు సమర్పించిన కానుకలన్నీ భద్రంగా ఉన్నాయని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ స్పష్టం చేసింది. మార్చి 31, 2026 నాటికి ట్రస్ట్ ఆధీనంలో 32.259 కేజీల బంగారం.. 1,518.925 కేజీల వెండి వస్తువులు ఉన్నట్లు అధికారికంగా ప్రకటించింది. విరాళాల చోరీ వివాదం నేపథ్యంలో రామాలయ ట్రస్ట్ కానుకల లెక్కలు తేల్చింది. మాయమయ్యాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగిన బంగారు రామచరితమానస్, వజ్రాల నెక్లెస్, వెండి పాదుకలను ట్రస్ట్ సభ్యులు మీడియా సమక్షంలో ప్రదర్శించారు. ప్రతి కానుకకూ దాత వివరాలతో సహా రికార్డులు ఉన్నాయని ట్రెజరర్ స్వామి గోవింద్ దేవ్ గిరి తెలిపారు. ఏటా స్వతంత్ర సీఏ సంస్థతో భౌతిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులు ఇచ్చిన 849 కేజీల వెండి వస్తువులను భారత ప్రభుత్వ మింట్ ద్వారా కరిగించి, శుద్ధి చేసి భద్రపరిచామని గోవింద్ పేర్కొన్నారు.



## సింగరేణికి తాడిచెర్ల-2 బొగ్గు గనులు

**దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రోజు(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ (SCCL) అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు.**

**హైదరాబాద్:** 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయని.. సుమారు 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని అన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని వెల్లడించారు.

సింగరేణికి సంబంధించిన మేజర్ మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ సింగరేణి కార్మికులు భాగస్వాములయ్యారని తెలిపారు. కార్మికుల ధైర్యాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. ఒడిశాలో నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. సింగరేణి పురోగతికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణతో పాటుగా ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేలా సింగరేణి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయన్నారు. 30 నుంచి 35 సంవత్సరాలకు సరిపోయే బొగ్గు ఉందని తెలిపారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం సింగరేణికి లభించిందని.. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందన్నారు. సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు కేటాయించామని కిషన్ రెడ్డి తెలిపారు. తాడిచర్ల-2 బొగ్గు గనులపై తుది నిర్ణయం తీసుకున్నామన్నారు. దాదాపు 182 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్న ఈ బ్లాక్ ద్వారా.. ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందన్నారు. దాదాపు 40 నుంచి 50 ఏళ్ల పాటు ఈ గని నుంచి బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని చెప్పుకొచ్చారు. దీని ద్వారా మొత్తంగా రూ.64,000 కోట్లకు పైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నేరుగా సింగరేణికి ఈ గని ఇవ్వడం ద్వారా ఆక్షన్ ప్రీమియం చెల్లింపు లేని కారణంగా ఆ సంస్థకు కనీసం రూ.2,550 కోట్లు మిగులుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి రాయల్టీ సహా వివిధ మార్గాల్లో దాదాపు రూ.16 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



## డిజిటల్ గవర్నెన్స్‌పై సీఎం ఫోకస్

**హైదరాబాద్:** కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయంలో ఈరోజు(మంగళవారం) ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. డిజిటల్ గవర్నెన్స్ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసి, అవసరమైన చట్టాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పరిపాలన వ్యవస్థను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేస్తూ ముందుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని సీఎం సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. వివిధ విభాగాల్లోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను డిజిటలైజ్ చేయాలని నిర్దేశించారు. డిజిటల్ గవర్నెన్స్‌పై పూర్తిస్థాయి కసరత్తు చేసేందుకు ఒక కమిటీని నియమిస్తున్నట్లు తెలిపారు. 100 రోజుల్లో ఆ కమిటీకి నివేదిక సమర్పించి ఒక కొలిక్కి తీసుకురాలని ఆదేశించారు. ప్రభుత్వం చెల్లింపులు చేసినా సమయానికి ఉద్యోగులకు జీతాలు చెల్లించని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## ఐటీ ఉద్యోగుల కోసం డైలీ షటిల్స్ సర్వీసులను ప్రారంభించిన మంత్రి పొన్నం



**మేడ్చల్ మల్కాజిగిరి సమయం ప్రతినిధి(జులై 7) :** ఐటీ ఉద్యోగుల సౌకర్యార్థం డైలీ షటిల్ సర్వీసులను ప్రారంభించినందుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చడానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయడం దాని భాగమని అన్నారు.నగరంలోని గ్లోబల్ సమ్మిట్ 2047లో రూపొందించిన ప్రణాళికల మేరకు ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడానికి ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రచారాక కమిటీ చైర్మన్ మధు యాష్కి గౌడ్, అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, డైలీ షటిల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.గతంలో నష్టాల్లో కొనసాగిన ఆర్టీసీని ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌలభ్యం దృష్టిలో ఉంచుకుని మెరుగుపరుస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు 350 కొత్త రూట్లలో బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. ఫలితంగా ఆర్టీసీ లాభాల బాటలోకి వస్తోందని అన్నారు. రవాణా శాఖ ఈవీ పాలసీ తీసుకువచ్చిందని, నగరంలో ఈవీ వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఐటీ ఉద్యోగుల కోసం నడుపుతున్న డైలీ షటిల్ సర్వీసుల్లో కూడా ఈవీ వాహనాలను ఉపయోగించాలని మంత్రి సూచించారు. ఈవీ వాహనాల వినియోగం పెంచడం ద్వారా కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని వ్యాఖ్యానించారు. మెట్రో, రైల్వే, ఆర్టీసీ సేవలను సమన్వయం చేసి లాస్ట్ మైల్ కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా కింది స్థాయి వరకు రవాణా సౌకర్యాలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## చిన్నారుల ప్రాథమిక అభ్యాస నైపుణ్యాల అభివృద్ధే లక్ష్యంగా అమలు : జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, జూలై 7 (సమయం ప్రతినిధి):** జిల్లాలో చిన్నారుల ప్రాథమిక అభ్యాస నైపుణ్యాల అభివృద్ధే లక్ష్యంగా అమలు చేయనున్న శిక్షణ ఫౌండేషన్ లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని బోయపల్లి అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి బోధనా విధానాలను పరిశీలించారు. శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు కార్యక్రమం లక్ష్యాలు, అమలు విధానాన్ని కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా 50 అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసి, చిన్నారుల్లో ప్రీ-లిటరసీ, ప్రీ-న్యూమరసీ, మోటార్ స్కిల్స్ అభివృద్ధికి ప్రత్యేక సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ట్యాబ్‌లు, బ్లూటూత్ స్పీకర్లు, టీచింగ్-లెర్నింగ్ మెటీరియల్ (టీ.ఎల్.ఎం.), స్టేషనరీతో పాటు అంగన్‌వాడీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రియదర్శిని' పాఠ్యాంశాలకు అనుగుణంగా 'శిశు వికాసన' పేరుతో ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. యాప్‌లో ప్రతిరోజూ నిర్వహించాల్సిన బోధనా కార్యక్రమాలతో పాటు అవసరమైన ఆడియో పాఠ్యాంశాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. దీంతో చిన్నారులకు మరింత సులభంగా, ఆసక్తికరంగా బోధన అందించవచ్చని వివరించారు. పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) మెరుగుదలకు 'ప్రేరణ ఎఫ్ఎల్ఎన్' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల హాజరు, తరగతి గది కార్యకలాపాల్లో చురుకైన



భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు స్టార్ అవార్డులు, బ్యాడ్జ్‌లు, గ్రూప్ యాక్టివిటీలు, బాధ్యతల కేటాయింపు వంటి వినూత్న విధానాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే అభ్యాస పురోగతిని అంచనా వేసేందుకు పిక్టోరియల్ ప్రోగ్రెస్ కార్డులు, తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులకు సంబంధించిన ఫౌండేషనల్ లెర్నింగ్ పుస్తకాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఆశ్రేయ హస్త ట్రస్టు దాతల సహకారంతో శిక్షణ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని 2026 నుంచి 2029 వరకు మూడు సంవత్సరాలపాటు అమలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఈ కార్యక్రమం ద్వారా పిల్లల అభ్యాస నైపుణ్యాలు గణనీయంగా మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి అవసరమైన అనుమతులు మంజూరు చేస్తామని, ఒకటి లేదా రెండు నెలల అనంతరం కార్యక్రమం పురోగతిని ప్రజలకు తెలియజేసేలా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. శిక్షణ ఫౌండేషన్ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం, మండల విద్యాధికారి లక్ష్మణ్ సింగ్, శిక్షణ ఫౌండేషన్ సీనియర్ ఆపరేషన్ మేనేజర్ కాశీనాథ్, జిల్లా మేనేజర్ యాదప్ప, గంగయ్యతో పాటు ఇతర అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఐశ్వర్యం నీడలో అప్పుల బతుకులు!

సంపద పోగుపడుతోంది, సామాన్యుల సంక్షేమం సన్నగిల్లుతోంది! వృద్ధిరేటు, ద్రవ్యోల్బణం శాతాలు మొదలైన స్థూల ఆర్థిక సూచికలు భారత ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యదాయకంగా, పురోగమన పథంలో ఉన్నదని మనకు విదితం చేస్తాయి. సగటు కుటుంబ బడ్జెట్‌ను పరిశీలించండి. స్థూల ఆర్థిక సూచికలు ఆవిష్కరిస్తున్న దృశ్యానికి భిన్నమైన వాస్తవ చిత్రం మనకు కనపడుతుంది. స్పష్టంగా చెప్పాలంటే మన దేశ ఆర్థిక వ్యవస్థ ఏమంత శ్రేయోదాయకంగా లేదు. సంపద సృష్టికర్తలైన అత్యధిక ప్రజలకు నిజమైన సంక్షేమం లభించడం లేదు. గత పన్నెండు సంవత్సరాలుగా ఆర్థిక వ్యవస్థ సృష్టిస్తున్న సంపద, వ్యక్తిగత కొనుగోలు శక్తి- ఒక వ్యక్తి తన ఆదాయంతో సమకూర్చుకోగల సరుకులు, సేవలు-మధ్య అతి ముఖ్యమైన లంకె తెగిపోయింది.

అనేక వృత్తులు, ఉద్యోగాలలో వాస్తవ వేతనాలు (ద్రవ్యోల్బణానికి అనుగుణంగా సర్దుబాటు చేసినవి) పెరగలేదు. అసంఖ్యాక శ్రామిక కుటుంబాలు తమ జీవన వ్యయాలకు రుణాలు తీసుకోవల్సిన అగత్యంలో ఉన్నాయి. ఇదొక నిష్ఠుర నిజం. క్రెడిట్ కార్డు రుణాలపై ఆధారపడుతున్న వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. అంతకంటే ముఖ్యంగా పదే పదే ఆ రుణాలు తీసుకోవడమూ పెరుగుతోంది. బంగారు ఆభరణాలు మొదలైన స్త్రీ ధనాన్ని తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడమూ విరివిగా జరుగుతోంది. స్తంభించిన వేతనాలు, పెరుగుతున్న వినియోగ వ్యయాలకు మధ్య అంతరాన్ని పూడ్చుకునేందుకు రుణాలు చేయడం తప్పనిసరి అయిపోయింది. వర్తమాన జీవన వాస్తవమిది. మన సమాజంలో ఇప్పుడు వేతన-రుణ సంక్షోభం ఎంత తీవ్రంగా ఉన్నది ఆ కఠోర వాస్తవం స్పష్టం చేస్తోంది. వేతనాలు వస్తున్నాయి. అవి సరిపోవడం లేదు. అప్పులు చేయడం అనివార్యమవుతోంది. విశేషమేమిటంటే అవి సులభంగా లభిస్తున్నాయి. వాటిని తీర్చడమే సమస్యవుతోంది. వేతన ఆదాయం జీవన వ్యయాలకు సరిపోకపోవడమే అందుకు కారణం. తత్ఫలితంగా శ్రామిక శ్రేణులు అపాయకరమైన ఆర్థిక దుస్థితిలోకి జారిపోతున్నాయి.

భారతీయ కార్మికుల ఆర్థిక ఇక్కట్లకు ధరల పెరుగుదలను కారణంగా చూపడం సమంజసం కాదు. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా చమురు సరఫరాలకు అంతరాయం కలగడంతో ధరలు పెరిగిన మాట నిజమే. అయితే మనుగడకు రుణాలు తీసుకోవల్సిన అగత్య మేర్పడడానికి కారణం అది మాత్రమే కాదు. జాతి సంపద సృష్టి అవుతున్న, పంపిణీ జరుగుతున్న తీరు తెన్నులే ఆ అసంగత పరిస్థితికి కారణాలని చెప్పి తీరాలి. ఆర్థిక వ్యవస్థ సుస్థిరంగా పురోగమిస్తోంది. స్టాక్ మార్కెట్ సూచీలు సదా ఊర్ధ్వ దిశలో ఉంటున్నాయి. అయితే పెరుగుతున్న జాతి సంపద, దానిని సృష్టించడంలో కీలకపాత్ర వహిస్తున్న శ్రామిక శ్రేణులకు సక్రమంగా, న్యాయబద్ధంగా పంపిణీ అవుతుందా? లేదు అనేదే కచ్చితమైన సమాధానం. వేతన అంతరాలు సుదీర్ఘకాలం కొనసాగితే దాని ప్రభావం స్థూల ఆర్థిక వ్యవస్థపై కూడా ఉంటుందనే వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. వేతనాలు బెత్తెడుగా ఉండిపోవడం, వ్యయాలు బారెడు కావడం వల్లే భారతీయ కుటుంబాల నికర పొదుపు మొత్తాలు రికార్డు స్థాయిలో తగ్గిపోతున్నాయి. స్థూల జాతీయ వినియోగ ఆదాయం (జీఎన్‌డీఐ)లో 7 నుంచి 8శాతంగా ఉండే ఈ పొదుపు మొత్తాలు 2022--23 ఆర్థిక సంవత్సరంలో 5.2శాతానికి తగ్గిపోయాయి. అయితే స్థిర, చరాస్తులు తాకట్టు పెట్టి తీసుకునే రుణాలు 2014లో 3శాతం నుంచి 2023లో 5.7శాతానికి పెరిగాయి. ఫలితంగా చెల్లించవలసిన అప్పుల మొత్తాలు కూడా గణనీయంగా పెరిగిపోయాయి. కోవిడ్ ఉపద్రవంలో కుదేలయిన దేశ ఆర్థిక వ్యవస్థ ఆ తరువాత బాగా కోలుకున్నదనడంలో సందేహం లేదు. అయితే ఈ ఆర్థిక పునరుద్ధరణ వేతనాల నైష్పత్తిక పెరుగుదల వల్ల కాకుండా కార్పొరేట్ లాభాల పెరుగుదల వల్లే అన్నది ఒక చేదు సత్యం. 2014-25 సంవత్సరాల మధ్య అనియత కార్మికుల వాస్తవ వేతనాల వార్షిక పెరుగుదల రేటు 1.5శాతం కంటే తక్కువగా ఉన్నది. ఈ వేతన అణచివేతకు తోడు పట్టణ ప్రాంతాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొరవడడంతో శ్రామిక శ్రేణుల జీవన పరిస్థితులు మరింత అధ్వానమయ్యాయి. పైగా 2018-19 సంవత్సరం నుంచి తిరోగమన వలసలు (ఉద్యోగాలు హరించుకుపోవడం, ఉపాధి అవకాశాలు మృగ్యమవడంతో పట్టణాలు, నగరాలకు వలసలు వచ్చినవారు తమ స్వస్థలాలకు తిరిగి వెళ్లిపోవడం) పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే వ్యవసాయేతర రంగాల నుంచి వ్యవసాయరంగ ఉపాధులకు లక్షలాది శ్రామికులు తిరిగి వెళ్ళిపోతున్నారు. వేతనాల పెరుగుదలకు ప్రత్యామ్నాయంగా రుణలబ్ధి అవకాశాలు ఇతోధికంగా పెరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి అదెంతవరకు ఉపకరిస్తుంది? సమాధానం స్పష్టమే. వేతనాలు పెరగకపోయినా రుణలబ్ధి అవకాశాలు ఇతోధికమవడంతో వినియోగదారు రుణాల స్వభావం మౌలికంగా మారిపోయింది. కుటుంబ రుణాలు ఇతోధికంగా పెరిగిపోవడం కంటే శ్రామిక ప్రజలు తమ జీవన వ్యయాల కోసం గణనీయంగా ఆ రుణాలపై ఆధారపడుతున్న పరిస్థితే బాగా కలవరపరుస్తోంది. ఇది దేశానికి ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని ఆర్థిక నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఈ అత్యవసర రుణాలు దేశ ప్రగతికి ఆటంకమవుతాయని పలువురు హెచ్చరిస్తున్నారు. సంప్రదాయంగా భారతీయ కుటుంబాలు తమకు డబ్బు అవసరమయినప్పుడు గృహాలు, పొలాలు, బంగారం మొదలైన వాటిని తనఖా పెట్టడం పరిపాటి. దీనివల్ల వారి తక్షణావసరాలు తీరడంతో పాటు స్థిర, చరాస్తుల రూపంలో భద్ర భవిష్యత్తును సమకూర్చుకునేందుకు కూడా దోహదం జరిగేది. మనుగడ కోసమే రుణాలు తీసుకోవలసిరావడం పరిస్థితులను సంక్లిష్టం చేస్తోంది. సురక్షితం కాని వ్యక్తిగత రుణాలు, వినియోగదారు రుణాల వార్షిక పెరుగుదల రేట్లు ఇటీవలి సంవత్సరాలలో 22 నుంచి 25శాతానికి పెరిగాయని ఆర్థిక సుస్థిరతపై ఆర్బీఐ (భారతీయ రిజర్వ్ బ్యాంక్) నివేదికలు వెల్లడించాయి. క్రెడిట్ కార్డులపై రుణాలు తీసుకోవడం, ఆభరణాలు మొదలైనవి తాకట్టు పెట్టి అప్పులు చేయడమనేది బాగా పెరిగిపోయింది. అయితే ఈ రుణాలు తిరిగి చెల్లించడం అంత చురుగ్గా జరగడం లేదు. ఫలితంగా వెండి, బంగారు ఆభరణాలకు సంబంధించి, చెల్లించని రుణాల మొత్తం రూ. 3.38 లక్షల కోట్లకు పెరిగిందని ఆర్బీఐ నివేదికలు వెల్లడించాయి. ఏటా ఈ రుణ బాకీల మొత్తం భారీ స్థాయిలో పెరుగుతూనే ఉన్నది. శ్రామిక కుటుంబాలు అధిక వడ్డీలతో సమకూర్చుకుంటున్న స్వల్పకాలిక రుణాలను తమ తక్షణావసరాలకు వినియోగించుకుంటున్నాయి. ఈ రుణాలను అవి తమ భావి ఆర్థిక స్తోమత భరోసాతోనే తీసుకుంటున్నాయనేది గమనార్హం. రేపో, మాపో లేదా ఆ తరువాతో తప్పకుండా అప్పు తీర్చగలమనే విశ్వాసంతోనే శ్రామిక కుటుంబాలు ఇలా రుణగ్రస్తమవుతున్నాయి. ఇదొక అవివేక వ్యవహారం. ఎందుకని? ఈ తరహా రుణాలు దీర్ఘకాలిక ఆర్థిక భద్రతను నిర్లక్ష్యం చేయడమే, సందేహం లేదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే శ్రామిక కుటుంబాల శ్రేయస్సుకు ఈ రుణాలు తోడ్పడవు. అప్పు చేసి పప్పు కూడు లాంటి ఈ రుణాలు, ఆదాయం పెరుగుదలతో సమకూరే ఆర్థిక భద్రతను ఇవ్వలేవు. ఒక స్థిరమైన సామాజిక భద్రతా వలయాన్ని సమకూర్చవు. ఇటువంటి సులభ రుణాల వల్ల శ్రామిక కుటుంబాల ఆర్థిక నష్టాలు రెట్టింపు అవుతాయి. ఈ కఠోర సత్యంతో పాటు వాస్తవ వ్యవసాయ వేతనాల వార్షిక పెరుగుదల 1శాతం కంటే తక్కువగా ఉందనే యథార్థాన్ని కూడా మనం పరిగణనలోకి తీసుకోవల్సి ఉన్నది. ఈ వాస్తవాలు స్పష్టం చేస్తున్నదేమిటి? దేశ ఆర్థిక వ్యవస్థ ఒక తీవ్ర సంక్షోభం ముంగిట ఉందనే కాదూ?

## దుబ్బాకకు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్



దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలక అడుగు పడిందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్ల నిధులను మంజూరు చేసి విడుదల చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాల విద్యను అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు.

దుబ్బాక నియోజకవర్గానికి ఈ విద్యాసంస్థ మంజూరు కావడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక వసతులు, డిజిటల్ విద్య, క్రీడా సదుపాయాలు, పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ వంటి అనేక అవకాశాలను పొందుతారని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత నియోజకవర్గ విద్యా రంగంలో గణనీయమైన మార్పు వస్తుందని, విద్యార్థుల భవిష్యత్తుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తోందని చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ప్రభుత్వ విద్యకు కొత్త దిశ లభిస్తోందని కొనియాడారు. దుబ్బాక నియోజకవర్గ ప్రజల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెరుకు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## నోటి క్యాన్సర్ ను తరిమేయడానికి గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ద్వారా అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దిలీప్




మేడ్చల్ మల్కాజిగిరి సమయం ప్రతినిధి (జులై 7) : ఓరల్ క్యాన్సర్ కు భారతదేశం పుట్టినిల్లు వంటిది. గుట్కా, ఖైనీ, తంబాకు వంటివి కేవలం భారతదేశంలో మాత్రమే ఎక్కువగా అమ్ముతారు, చాలా దేశంలో వీటివిక్రయం నిషేదం. వీటినుంచి నోటి క్యాన్సర్ వస్తుందని ఫేషియల్ సర్జన్ డాక్టర్ దిలీప్ తెలిపారు. ఎంతో ప్రమాదకరమైన ఈ క్యాన్సర్ ను మొదటి దశలో గుర్తిస్తే వైద్యం చేయడం సులభం అవుతుందని తెలిపారు. ఇండియాలో చాలావరకు యువత నోటి క్యాన్సర్ బారిన పడుతున్నారని, ఎంతో జీవితం ఉన్నవారు ఈ మహమ్మారి నుంచి బయటపడాలి అంటే మొదటి దశలోనే వైద్యుడిని సంప్రదిస్తే వెలస్కోప్ ద్వారా నోటి క్యాన్సర్ ను గుర్తించవచ్చు. తరువాత వైద్యం చేసి ప్రాణాలను రక్షించవచ్చు అని డాక్టర్ దిలీప్ వివరించారు. 5 సంవత్సరాల క్రితం 21 సంవత్సరాల అబ్బాయికి కూడా నోటి క్యాన్సర్ ఉండడంతో షాక్ అయ్యామని తెలిపారు. వక్కలు తినడం, పొగాకు నమలడం, సిగరెట్, బీడీ, గుట్కా ఇలాంటి మత్తు పదార్థాలను సేవించడం ద్వారా ఈ నోటి క్యాన్సర్ అనేది ఎక్కువగా వస్తుంది. నొప్పి ఉండదు కాబట్టి దీన్ని గుర్తించడం వ్యక్తులకు పెద్దగా సాధ్యం కాకపోవచ్చు. నోటిలో ఏదైనా అసాధారణంగా అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా మొదటి దశలోనే ఓరల్ క్యాన్సర్ ను పసిగట్టవచ్చు. దీంతో వైద్యం సులభం అవుతుంది ప్రాణాపాయం తప్పుతుంది. దీనిపై అవగాహన కల్పించడానికి గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఏర్పాటు చేశాము అని తెలిపారు. గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మారథాన్ నిర్వహిస్తారు. గత రెండు సంవత్సరాలుగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సంవత్సరం కూడా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్ర రావు ముఖ్యఅతిథిగా మారథాన్ కార్యక్రమాన్ని చేసినట్టు తెలిపారు. ఓరల్ క్యాన్సర్ ను నివారించడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను చేపట్టబోతున్నాము. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు కూడా దీని గురించి వివరించి వారి సేవలను ఉపయోగించుకొని మరింత అవగాహన కార్యక్రమాన్ని పెంచుతాము. ఇందులో భాగంగా ప్రముఖ భారతీయ వైద్యుడు, రేడియేషన్ ఆంకాలజిస్టు నోరి దత్తాత్రేయుడు కలవడం జరిగింది. ట్రస్టు ద్వారా చేస్తున్న పనులను ఆయన కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని చేస్తూ భారతీయులకు ముఖ్యంగా యువతకు అవగాహన పెంచాలని సూచించారు. దీనికోసం తనకు సాధ్యమైనంత సహాయం కూడా చేస్తానని తెలిపారు. అలాగే తెలుగు సినిమా నటుడు రాజా రవీంద్రను కూడా కలవడం జరిగింది. సినిమా మాధ్యమం ద్వారా కూడా దీనిపై అవగాహన పెంచాలని, అందుకు పరిశ్రమ నుంచి తగిన ఏర్పాట్లు చేస్తానని మాట ఇవ్వడం జరిగింది.

## కేతపల్లి ప్రభుత్వ పాఠశాలలో రీఓపెనింగ్ నిర్వహించిన ఎంఈఓ బ్రహ్మాచారి




దేవరకొండ:నేరేడుగొమ్ము, జూలై 7:(సమయం ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వ హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ప్రక్రియలో భాగంగా విలీనమైన ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త విద్యా సంవత్సరానికి సోమవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. నేరేడుగొమ్ము మండలంలో గతంలో కొనసాగిన 18 ప్రభుత్వ పాఠశాలలు విలీనమవగా, ప్రస్తుతం కేతపల్లి, ధర్మరేఖ తండా, వైజాగ్ కాలనీ, బచ్చాపురం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే విద్యాబోధన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేతపల్లి ప్రభుత్వ పాఠశాలలో రీఓపెనింగ్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) బ్రహ్మాచారి పాఠశాలను పునఃప్రారంభించి విద్యార్థులకు పూలు అందజేస్తూ ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, మధ్యాహ్న భోజన ఏర్పాట్లు, పరిశుభ్రత, పాఠ్యపుస్తకాల పంపిణీ తదితర అంశాలను పరిశీలించి ఉపాధ్యాయులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ బ్రహ్మాచారి మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను విద్యార్థులు పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మొదటి రోజు నుంచే క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కేతపల్లి గ్రామ సర్పంచ్ పద్మ-భీమ్‌సింగ్, ఉపసర్పంచ్ కొత్తపెల్లి జంగమ్మ-రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త విద్యా సంవత్సరం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. మండలంలో పాఠశాలల విలీనం అనంతరం ప్రారంభమైన తొలి విద్యా కార్యక్రమానికి కేతపల్లి ప్రభుత్వ పాఠశాల వేదిక కావడం విశేషం. మిగిలిన మూడు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా విద్యాబోధన కొనసాగుతోంది.

## ప్రధాని మోదీకి ఇండోనేసియా అత్యున్నత పౌర పురస్కారం

మొదటి పేజీ తరువాయి

భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ వేదికపై మరో అరుదైన గౌరవం దక్కింది. ఇండోనేసియా దేశం తమ అత్యున్నత పౌర పురస్కారమైన 'బింటాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేసియా' అవార్డును ప్రధాని మోదీకి ప్రకటించింది. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ అందించిన విశేష కృషికి గుర్తింపుగా ఇండోనేసియా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఈ అత్యున్నత పురస్కారాన్ని అధికారికంగా ప్రకటించారు. భారత్-ఇండోనేసియా దేశాల మధ్య చారిత్రక బంధాన్ని కొత్త శిఖరాలకు చేర్చడంలో ప్రధాని మోదీ పోషించిన పాత్రను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల) ప్రయోజనాల కోసం, ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో శాంతి భద్రతల కోసం భారత్ అందిస్తున్న సహకారం అమోఘమైనదని ఆయన ప్రశంసించారు.

## ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహణకు ప్రభుత్వ నిర్ణయం

సమయం ప్రతినిధి మహబూబ్నగర్ : రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక టెట్ నిర్వహిస్తున్న నేపథ్యంలో, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2028 సెప్టెంబర్‌లోగా ఇన్‌సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు టెట్‌లో ఉత్తీర్ణులు కావాలని నిర్దేశించిన నిబంధనపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపాధ్యాయ వర్గాలు స్వాగతించాయి. ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నిలి తెలంగాణ ఉపాధ్యాయుల తరఫున రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎన్. విజయ్ కుమార్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు

## ఎస్ఐఆర్ పై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి : మాజీ ఎమ్మెల్యే




సమయం ప్రతినిధి దేవరకద్ర : మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం దేవరకద్ర మండలం డోకూర్ గ్రామంలో ఎస్ ఐ ఆర్ (SIR) జరుగుతున్న తీరు పై డోకూరు, గోపన్ పల్లి,జీనుగురాల, గుడిబండ గ్రామాల బూతు ల వారీగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బూత్ ఇంచార్జి లతో కార్యకర్తలతో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ,ఆల ప్రీతి రెడ్డి .. సమావేశమయ్యారు.మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి గారి కామెంట్స్..ఎస్ ఐ ఆర్ పై బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి.వలస వెళ్లిన ఓటర్ల పై ప్రత్యేక దృష్టి సారించాలి.అర్హులైన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా బి ఎల్ ఏ లు దగ్గరుండి నమోదు చేయించాలి.ఓట్లు తొలగించే కుట్ర జరిగే అవకాశం ఉంది. ఎన్యూమరేషన్ ఫాం ల పంపిణీ,ఆన్ లైన్ లో నమోదు చేయించే వరకు పార్టీ బీ ఎల్ ఏ లు బాధ్యత తీసుకోవాలి.ఎస్ ఐ ఆర్ తో బీ ఎల్ ఏ లకు బూత్ మీద స్పష్టమైన అవగాహన వస్తుంది.పార్టీ సంస్థాగత నిర్మాణంలో మనకు చాలా ఉపయోగపడుతుంది.బీఆర్ఎస్ పార్టీ సంస్థాగత నిర్మాణం, SIR పై, సభ్యత్వ నమోదు కార్యక్రమం పై బీఆర్ఎస్ శ్రేణులకి దిశానిర్దేశం చేశారు.

# ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించాలి: మంత్రి శ్రీహరి

## అమరచింత మండలంలో రూ.6.60 కోట్లతో చంద్రఘడ్ -నాగిరెడ్డి పల్లి -బెక్కరపల్లి ఎత్తిపోతల పథకాల మరమ్మత్తు పనులకు మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన





**మక్తల్ :** మక్తల్ నియోజకవర్గంలోని అమరచింత మండలం ఈర్లదిన్నె గ్రామంలో చంద్రఘడ్-నాగిరెడ్డిపల్లి-బెక్కర్‌పల్లి ఎత్తిపోతల పథకాల మరమ్మత్తు పనులకు రూ.6 కోట్ల 58 లక్షల 50 వేల (దాదాపు రూ.7 కోట్లు) వ్యయంతో చేపట్టనున్న మరమ్మత్తు పనులకు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత పదేళ్లలో లిఫ్ట్‌ల నిర్వహణకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, కనీసం గ్రీజు డబ్బా కూడా ఇవ్వని పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ లిఫ్ట్‌ల పునరుద్ధరణకు భారీ నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రిఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా ఉన్నప్పటికీ సాగునీటి ప్రాజెక్టులకు నిధులు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు అభివృద్ధి చేయడం తన బాధ్యత అని స్పష్టం చేసిన మంత్రి, జంగంరెడ్డిపల్లి, భూత్పూర్ ప్రాంతాల్లో కూడా కొత్త సాగునీటి పథకాలు తీసుకొస్తున్నామని వెల్లడించారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారని, "వరి వేస్తే ఉరి" అన్న పరిస్థితులు సృష్టించారని విమర్శించారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర ఇవ్వలేదని, కానీ తమ ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తూ రైతులకు అండగా నిలుస్తోందన్నారు. తెలంగాణలో పండిన ధాన్యం తెలంగాణ ప్రజలకే ఉపయోగపడాలనే లక్ష్యంతో రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జూరాల నీటి విషయంలో ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడానికి బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించిన మంత్రి, నీరు అందరిదని, సమస్యలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. చంద్రఘడ్ లో 950 ఎకరాల ఆయకట్టు, 705 కుటుంబాలకు రూ.1.92 కోట్లు, బెక్కర్‌పల్లి లిఫ్ట్‌కు 4,900 ఎకరాల ఆయకట్టు, 885 కుటుంబాలకు రూ.2.13 కోట్లు, నాగిరెడ్డిపల్లి లిఫ్ట్‌తో కలిపి మొత్తం సుమారు 15 వేల ఎకరాల ఆయకట్టుకు రూ.6.58 కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేస్తోందని వివరించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని, విమర్శలు చేసే వారిని గత పదేళ్లలో ఏమి చేశారో ప్రశ్నించాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కల్లు గీత కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్, స్థానిక సర్పంచులు, అమరచింత, నర్వ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, చెన్నయ్య సాగర్ తదితరులు పాల్గొన్నారు.


## రెండు నెలల తర్వాత బస్తాలు తగ్గాయా?.. మొక్కజొన్న రైతుల బిల్లులు నిలిపివేతపై ఆందోళన.

**గద్వాల జూలై 7 :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో మద్దతు ధరకు మొక్కజొన్న విక్రయించిన రైతులకు రెండు నెలలు గడిచినా పూర్తి చెల్లింపులు అందకపోవడంతో ఆందోళన నెలకొంది. కొనుగోలు సమయంలో ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయని అధికారులు ఇప్పుడు గోదాములో బస్తాల కొరత ఉందని చెబుతూ బిల్లులు నిలిపివేయడం రైతులను అయోమయానికి గురిచేస్తోంది. వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామానికి చెందిన రైతు మల్లెందొడ్డి కోటేశ్వర గౌడ్ గ్రామ రైతులతో కలిసి మొత్తం 624 బస్తాల మొక్కజొన్నను కొనుగోలు కేంద్రానికి విక్రయించారు. అయితే ఇటీవల సొసైటీ సిబ్బంది ఫోన్ చేసి ఆయన సరుకులో 9 బస్తాలు తక్కువగా ఉన్నాయని ఆ వ్యత్యాసాన్ని అంగీకరిస్తేనే బిల్లు విడుదల చేస్తామని తెలిపినట్లు రైతు ఆరోపించారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో అధికారులు సిబ్బంది లారీ డ్రైవర్ సమక్షంలో బస్తాలు లెక్కించి లోడ్ చేశారు. రెండు నెలల తర్వాత బస్తాలు తగ్గాయని చెప్పడం అన్యాయం. మా డబ్బులు నిలిపివేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై అధికారులు వెంటనే న్యాయం చేయాలి అని కోరారు. ఈ విషయంపై సొసైటీ సీఈఓ రవి స్పందిస్తూ రైతు చెప్పిన విషయం వాస్తవమేనని తెలిపారు. ఆదోని గోదాముతో పాటు ఇతర గోదాములకు పంపిన లారీల్లో కలిపి 30కి పైగా బస్తాల వ్యత్యాసం నమోదైనట్లు చెప్పారు. అయితే లారీ డ్రైవర్లపై అనుమానం వ్యక్తం చేసే పరిస్థితి లేదని తాట్ ఫారాలతో కప్పి తాడుతో బిగించి సరుకును పంపించామని వివరించారు. ఈ నేపథ్యంలో సంబంధిత రైతులకు సమాచారం ఇచ్చామని అన్ని లోడ్ల వివరాలను మరోసారి సమగ్రంగా పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని సొసైటీ సీఈఓ తెలిపారు.

## రూ.80 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నేనావత్

**దేవరకొండ: జూలై 7 (సమయం ప్రతినిధి) :** దేవరకొండ పట్టణంలోని 7వ వార్డులో రూ.80 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేశారు." అనంతరం నిర్మాణం జరుగుతున్న సీసీ రోడ్డుపై కాలినడకన పర్యటిస్తూ పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ . మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దేవరకొండ పట్టణ అభివృద్ధికి అవసరమైన రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా చేపడుతూ దేవరకొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, మున్సిపల్ అధికారులు, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ కల్వ భాస్కర్‌కు హైదరాబాద్ బదిలీ జిల్లా అధికారుల ఆత్మీయ వీడ్కోలు



**మహబూబ్‌నగర్, జూలై 7 (సమయం ప్రతినిధి):** మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ కల్వ భాస్కర్‌ను హైదరాబాద్‌కు బదిలీ చేస్తూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీజీఎం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ పదవి నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీపై వెళుతున్న కల్వ భాస్కర్‌ను జిల్లా అధికారు లు ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లో ఆయన మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కల్వ భాస్కర్ జూన్ 2022 నుంచి జూన్ 2025 వరకు మహబూబ్‌నగర్ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వహించారు. ఈ కాలంలో బ్యాంకులు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం సాధిస్తూ వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద రుణాల మంజూరులో విశేష సేవలు అందించి జిల్లా అధికారుల ప్రశంసలు అందుకున్నారు. అనంతరం జూలై 2025 నుంచి కలెక్టరేట్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించి సమర్థవంతంగా విధులు నిర్వహించారు. జిల్లా అధికారులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ప్రభుత్వ సమావేశాల్లో సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించారు. వీడ్కోలు కార్యక్రమంలో సమాచార, పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులు పి. శ్రీనివాస్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కె. రవీందర్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొని కల్వ భాస్కర్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధనకై ఉద్యమించండి



**సమయం ప్రతినిధి దేవరకద్ర :** సాధించుకున్న తెలంగాణలో ఉమ్మడి మహబూబ్నగర్ నీటి కేటాయింపుల్లో అన్యాయం జరిగింది. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో నేడు మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రంలో స్థానిక గ్రంథాలయం దగ్గర విలేకరుల సమావేశం జరిగింది. జేఏసీ కో చైర్మన్ బెక్కం జనార్దన్ మాట్లాడుతూ మహబూబ్నగర్ ఉమ్మడి జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన కొరకు రాజకీయాలకతీతంగా రైతులు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు,విద్యావంతులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకొని పుష్కరకాలం గడుస్తున్న పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తి కాలేదని ఆయన విమర్శించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో మహబూబ్నగర్ జిల్లా కరువు,వలసలు చర్చనీయాంశంగా ఉన్నాయని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు జూరాల నుండి లక్ష్మీదేవి పల్లి వరకు రూపొందించిన ప్రణాళికను బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి శ్రీశైలం నుండి మార్చడం వల్ల ఆర్థిక భారం పెరిగిందన్నారు. అనేక రిజర్వాయర్లను ఎలాంటి ఆయకట్టు లేకుండా నిర్మించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వాస్తవ ఆయ కట్టుకున్న కరివేన రిజర్వాయర్ పూర్తి కాలేదన్నారు. ఉద్దండపూర్ ఇంకా ప్రారంభ దశలోనే ఉందని లక్ష్మీదేవిపల్లి ఊసే లేదని విమర్శించారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు నీళ్లు ఇచ్చే ప్రాజెక్టులు పూర్తికాకుండానే దిండి ఎత్తిపోతల పథకం ద్వారా మహబూబ్నగర్ నీళ్లను నలగొండ జిల్లాకు తరలించే కుట్ర గత పాలకులు చేశారని తెలిపారు. అవే విధానాలను నేటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కూడా కొనసాగించడం శోచనీయమన్నారు. మహబూబ్నగర్ జిల్లా వాసి శ్రీ రేవంత్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఈ జిల్లా నీటి కేటాయింపులో అన్యాయం జరగకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

జేఏసీ నాయకులు చెన్న కిష్టయ్య గారు మాట్లాడుతూ ఈనెల 19న మహబూబ్నగర్ పట్టణంలోని క్రౌన్ ఫంక్షన్ గార్డెన్ లో విస్తృత రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాజకీయాల కతీతంగా శాసనసభ్యులను, మాజీ శాసనసభ్యులను, అనేకమంది ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గం నుండి కూడా ఈ సమావేశంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య( టి ఎఫ్ టి యు ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్ మాట్లాడుతూ మహబూబ్నగర్ జిల్లా ప్రాజెక్టులు పెండింగ్ ఉండడం ఈ జిల్లా రాజకీయ నాయకుల వైఫల్యం అన్నారు. ఉత్తర తెలంగాణ, నల్గొండ జిల్లా రాజకీయ నాయకులకు ఉన్న చొరవ మహబూబ్నగర్ జిల్లా నాయకులకు లేకపోవడం మహబూబ్నగర్ జిల్లాకు శాపంగా మారిందన్నారు. మహబూబ్నగర్ జిల్లాకు వర్షపాతం తక్కువ ఉందన్న విషయం అందరికీ తెలిసిందేనని కానీ మహబూబ్నగర్ జిల్లాలో కృష్ణ,గోదావరి, తుంగభద్ర, బీమా, దుందుభి నదులు ప్రవహిస్తున్నాయని వాటి ద్వారా ఎత్తిపోతల పథకాలను శాస్త్రీయంగా నిర్మాణం చేస్తే విస్తారమైన మహబూబ్నగర్ జిల్లాకు సాగునీరు,తాగునీరు అందుతుందని తెలిపారు. వీటి సాధనకు రాజకీయ పార్టీల వైపు చూడకుండా మహబూబ్నగర్ జిల్లా పౌర సమాజం పోరాటాలకు సిద్ధపడాలని కోరారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు సాంబశివుడు మాట్లాడుతూ కోయిల్ సాగర్ ఆయకట్టులో అత్యధిక భాగం బీడు భూములుగా మారాయనిమర్శించారు. తెలంగాణ బీడీ కార్మిక సంఘం నాయకులు పి.యాదగిరి మాట్లాడుతూ నీటి ప్రాజెక్టులు నిర్మిస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక న్యాయవాది ఆర్ఆర్ మన్యం, కృష్ణయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి గురుకుల సొసైటీ ఆర్సిఓ స్వప్న అక్రమాల పై పిర్యాదు చేసిన జాతీయ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి



**దేవరకొండ: జూలై 7 (సమయం ప్రతినిధి) :** ఏంజేపీ బీసీ గురుకుల నల్గొండ జిల్లా ఆర్సిఓ ఈ స్వప్న అక్రమాలు, అరాచకాల పై గత కొన్ని సంవత్సరాలుగా డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించిన విషయం విధితమే. ఎన్నోసార్లు ఆమెను అడిగిన, మందలించిన ఆమె తీరు మారకపోవడం, అందుబాటులో ఉండకపోవడం ,కనీసం ఫోన్ లో కూడా సమాధానం ఇవ్వకపోవడంతో డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాసబ్ ట్యాంక్ లోని మహాత్మ జ్యోతిబాపూలే ఆఫీస్ లో సెక్రెటరీ బడుగు సైదులు ప్రిన్సిపల్ సెక్రెటరీ బాలమయాదేవి కి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ఫిర్యాదులో ప్రధానంగానల్లగొండ జిల్లాలో కావాలనే ఇంటర్మీడియట్ లోని సీఈసీ గ్రూపులో సీట్లు భర్తీ చేయకపోవడం, అహంకారపూరితమైన, కుట్రపూరితంగా, దురుద్దేశంతో వ్యవరించడం ,దురసు ప్రవర్తన, కుల వివక్ష, ఇంటర్మీడియట్ అడ్మిషన్ విషయాల్లో పారదర్శకత లేకపోవడం, సమయపాలన పాటించకపోవడం, ప్రజలకు విద్యార్థులకు, బీసీ ఉద్యమ నాయకులకు అందుబాటులో ఉండకపోవడం, విద్యార్థులు వారి తల్లిదండ్రుల పై దురుసుగా ప్రవర్తిస్తూ, అసభ్యకరమైన పదజాలంతో రెచ్చిపోవడం , దేమోల పేరిట డబ్బు దన్నుకోవడం, బీసీ గురుకుల లోనే పనిచేస్తే బీసీ వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారు అని ఆయన ఈ ఫిర్యాదులో తెలియజేయడం జరిగింది. మరియు ఈ ఫిర్యాదులో ఆమె చేసిన అక్రమాల చిట్టాను, అవినీతిని ప్రశ్నిస్తూ స్పష్టంగా వారికి కల్సి వివరించారు. సుమారుగా రెండు పేజీల లేఖ ద్వారా ఆమె అవినీతిని ఎండగట్టి పిర్యాదు చేశారు. ఈ పిర్యాదు పత్రాన్ని మీడియా ముందు పెట్టారు. ఈ పిర్యాదు ను సెక్రటరీ ప్రిన్సిపల్ సెక్రటరీ లు నిషితముగా పరిశీలించారు. ఒక వారం రోజుల్లోనే ఆమె పై చర్య ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఒక వేళ వారం రోజుల్లో ఆమెను సస్పెండ్ చేయకపోతే పెద్దయెత్తున ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## బీటెక్ ఉద్యోగుల జీతాల మించి శానిటరీ ఉద్యోగుల జీతాలే...

**హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగరపాలక సంస్థ ఐటీ నిపుణుల కొరతను తీర్చేందుకు జారీ చేసిన ఒక టెండర్ నోటిఫికేషన్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నగరంలో ఎంతో నైపుణ్యం కలిగిన ఐటీ ఉద్యోగులకు ఆఫర్ చేస్తున్న వేతనాలు శాశ్వత శానిటేషన్ కార్మికుల జీతాల కంటే చాలా తక్కువగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. జీహెచ్ఎంసీ ఒక సంవత్సరం కాల పరిమితిపై ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 25 మంది ఐటీ ప్రొఫెషనల్స్‌ను నియమించుకోవడానికి తాజాగా నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. అయితే ఇందులో ప్రతిపాదించిన పే స్కేల్ ప్రస్తుతం హాట్ టాఫిక్‌గా మారింది. ఈ అధికారిక నోటిఫికేషన్ ప్రకారం.. హార్డ్‌వేర్ ఇంజనీర్లు, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్లు, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్లు, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్లు, ప్రోగ్రామర్లు, టీమ్ లీడర్లు, జీఐఎస్ అనలిస్ట్‌లు, వెబ్ డిజైనర్ల వంటి వివిధ విభాగాల నిపుణుల కోసం జీహెచ్ఎంసీ దరఖాస్తులను కోరింది. అయితే వీరికి కేటాయించిన వేతనాల వివరాలు గమనిస్తే.. 12 మంది హార్డ్‌వేర్ ఇంజనీర్ల పోస్టులకు నెలకు రూ. 28 వేల చొప్పున వేతనం ప్రతిపాదించారు. కనీసం మూడేళ్ల అనుభవంతో పాటు ఎంటెక్ ఉన్నత విద్యార్హత కలిగిన సీనియర్ జీఐఎస్ అనలిస్ట్‌కు నెలకు రూ. 37 వేలు మాత్రమే చెల్లించనున్నారు. బీటెక్ విద్యార్హతతో పాటు ఆరు సంవత్సరాల సుదీర్ఘ అనుభవం గల వెబ్ డిజైనర్ పోస్టుకు కేవలం రూ. 42 వేలు వేతనంగా నిర్ణయించారు. ఈ వేతన ప్యాకేజీలను జీహెచ్ఎంసీలోని శానిటేషన్ కార్మికుల జీతాలతో పోల్చి చూస్తే ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగుచూశాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధుల సమాచారం ప్రకారం.. జీహెచ్ఎంసీలో కొత్తగా చేరే శానిటేషన్ కార్మికులకే (ఔట్ సోర్సింగ్ కాకుండా) ప్రారంభంలో నెలకు రూ. 30 వేల నుంచి రూ. 35 వేల వరకు వేతనం అందుతోంది. ఇక కార్పొరేషన్‌లో శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న సీనియర్ శానిటేషన్ కార్మికులు తమ సర్వీసు కాలాన్ని బట్టి నెలకు రూ. 50 వేల నుంచి గరిష్టంగా రూ. 80 వేల వరకు జీతాలు అందుకుంటున్నారు. విద్యా అర్హతలతో సంబంధం లేకపోయినా సీనియారిటీ కారణంగా వారి జీతాలు ఐటీ ఉద్యోగుల కంటే ఎంతో మెరుగ్గా ఉన్నాయి. ఈ తక్కువ వేతనాల వ్యత్యాసంపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందిస్తూ.. ఐటీ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి గత ఐదేళ్లుగా ఎలాంటి పే-స్కేల్ సవరణలు జరగకపోవడమే దీనికి ప్రధాన కారణమని వివరించారు. ప్రభుత్వం 2022 సంవత్సరం నుంచి ఔట్‌సోర్సింగ్ ఐటీ పోస్టులకు సంబంధించి పీఆర్సీసీ నిబంధనలను అమలు చేయకపోవడంతో పాత జీతాలనే కొనసాగించాల్సి వస్తోందని పేర్కొన్నారు.

# ఆసుపత్రులకు జీవనాడి ఆశా కార్యకర్తలే : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం





**(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) :** ఆసుపత్రులకు ఆశా కార్యకర్తలే నిజమైన జీవనాడి అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఆశా కార్యకర్తల కోసం నిర్మించిన విశ్రాంతి నిలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తన ఎస్డీఎఫ్ మరియు ముడా నిధులు రూ.30 లక్షల వ్యయంతో ఈ విశ్రాంతి నిలయం నిర్మించబడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, ప్రతి తల్లి గర్భం దాల్చిన క్షణం నుండి శిశువు సురక్షితంగా ఇంటికి చేరే వరకు ఆశా కార్యకర్తలు ఎంతో బాధ్యతతో తమ సేవలు అందిస్తారని అన్నారు. తమకు కేటాయించిన గ్రామం లేదా వార్డులోని ప్రజలతో ఆత్మీయంగా మమేకమై మానవతా దృక్పథంతో పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది కొంతమంది ఆశా కార్యకర్తలను ఆసుపత్రిలో ఉండనీయకుండా అగౌరవపరిచిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. వారు చేస్తున్న సేవలకు తగిన గౌరవం దక్కాలని, వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ఈ విశ్రాంతి నిలయాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఆసుపత్రి సిబ్బందికి సూచనలు ఇస్తూ, ముందుగా ఆశా విశ్రాంతి నిలయాన్ని శుభ్రం చేసి తరువాత ఇతర గదులను శుభ్రం చేయాలని తెలిపారు. అలాగే ఆశా నిలయం ముందు ఎల్లప్పుడూ ఒకరు సెక్యూరిటీ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. మంచి కార్యక్రమాలు చేపట్టేవారిని సమాజం గౌరవించాలని, తప్పు జరిగితే ఎదిరించే ధైర్యం కూడా కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఆసుపత్రి అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, రోగులతో పాటు వచ్చే వారి కోసం కూడా ప్రత్యేక విశ్రాంతి గది ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఆశా కార్యకర్తల జీతాల పెంపు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన నవజాత శిశువుల తల్లులకు ఈ సందర్భంగా యెన్నం హెల్త్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగ అజ్మీర, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ సామ్యులు, బెజ్జుగం రాఘవేందర్, సాదుల్లా కార్పొరేటర్లు సల్మాన్, తాహెర్, విట్టల్ రెడ్డి, షబ్బీర్ , కిషన్ నాయక్, సతీష్, అవేజ్, నాయకులు అబ్దుల్ హక్, బాను తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి జులై 7 :** నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఈవీఎం గోదాంలో అమలవుతున్న భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ నిఘా వ్యవస్థ, సీలింగ్ విధానం, స్ట్రాంగ్‌రూమ్ నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈవీఎంల భద్రత, నిర్వహణ ప్రమాణాలను అధికారులు సమర్థవంతంగా అమలు చేస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించి ఆరా తీశారు.ఈ సందర్భంగా గోదాంలోని రికార్డులు, భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, ఎన్నికల శాఖ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఈదురు గాలులకు కరెంటు వైర్లపై విరిగిపడ్డ చెట్టు

**గద్వాల :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కు ఆనుకుని ఉన్న బాలికల వసతి గృహానికి ఆనుకుని ఉన్న చెట్టు ఈదురుగాలకు విరిగిపడడం జరిగింది. ఈ చెట్టు కరెంటు వైర్లపై విరిగిపడడం జరిగింది. విద్యుత్ శాఖ అధికారులు ఇట్టి విషయాన్ని గమనించి ఎలాంటి ప్రమాదాలకు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పై షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

### పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నలమోని శ్రీధర్

**మహబూబ్ నగర్ :** ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పై షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో సీతారాంను పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నలమోని శ్రీధర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పై లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, గిరిజన రాష్ట్ర నాయకులు రఘునాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, శ్రీశైలం గౌడ్, డాకం మనీష్, ముబారక్ అలీ ఖాన్, బాలు నాయక్, రోమియో రమేష్, నాని, లింగాడిగూడ ఉప సర్పంచ్ అశోక్, అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మంగళవారం షాద్ నగర్ చౌరస్తాలో సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం రాళ్లతో బట్టలు ఊడదీసి కొట్టి చంపాలని ప్రజలను ఇతరులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం శాంతి భద్రతలకు వివాదం కల్పించేలా ఉన్న అతని చర్యలపై పోలీసులు కేసులో నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని కోరారు. శాంతియుత వాతావరణం లో ఉన్న ఈ ప్రాంతాన్ని తన మాటలు ప్రసంగాలతో రెచ్చగొడుతూ సాక్షాత్తు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నే చంపాలని టార్గెట్ గా పెట్టుకుని రెచ్చగొట్టిన తీరు అప్రజా స్వామీ కమని ఇలాంటి చర్యలు రాజకీయాల్లో సరికాని వారు పేర్కొన్నారు. వివాదాస్పద వ్యాఖ్యలతో అందరినీ రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే శంకర్ విషయంలో వ్యవహరించిన తీరు ఆక్షేపనియమని దీని ద్వారా కాంగ్రెస్ పార్టీలో కలవరం మొదలైందని కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయని శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వ్యాఖ్యలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్య తీసుకోవాలని కోరారు. ఈ విషయమై స్థానిక సీఐ సీతారాంను వివరణ అడుగగా ఫిర్యాదు అందిందని ఆయన స్పష్టం చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ శరవేగం 99.62 శాతం ఫారాల పంపిణీ పూర్తి



**మహబూబాబాద్, జూలై 7, (సమయం ప్రతినిధి) :** జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం శరవేగంగా కొనసాగుతోందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 99.62 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందన్నారు. డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ చేపడుతున్నారని తెలిపారు. అందిన ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. బీఎల్ఓలు ఫారం-6 డిక్లరేషన్‌తో ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరిస్తున్నారని, ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పేర్కొన్నారు. జిల్లాలో డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో మొత్తం 555 మంది బీఎల్ఓలు, 56 మంది సూపర్‌వైజర్లు, 12 మంది ఏఈఆర్ఓలు, ఇద్దరు ఈఆర్ఓలు విధులు నిర్వర్తిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. సర్వేకు వెళ్లే ప్రతి సిబ్బంది తప్పనిసరిగా ఐడీ కార్డు, క్యాప్‌తో పాటు అవసరమైన మెటీరియల్ తీసుకెళు న్నారని చెప్పారు. జిల్లాలోని 555 పోలింగ్ కేంద్రాల పరిధిలో 4,84,935 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 4,83,099 ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందన్నారు. వీటిలో 47,535 ఫారాలను పరిశీలించగా 75 మంది ఓటర్లు మృతి చెందినట్లు, 19 మంది నివాసం మార్చుకున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఓటర్లు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి voters.eci.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని, లేదా ECINET యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎన్యూమరేషన్ ఫారం సమర్పించవచ్చని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1950ను సంప్రదించాలని కోరారు. ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిపై వారానికి ఒకసారి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొంటున్నారని చెప్పారు. ప్రతి మండలంలో డివిజన్ల వారీగా బీఎల్ఓలు, సూపర్‌వైజర్లతో సమావేశాలు నిర్వహించి డిజిటలైజేషన్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

## ఆపరేషన్ ముస్కాన్-12 పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ డి. జానకి

**బాల కార్మికులు, బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం**




**మహబూబ్‌నగర్, జూలై 7 (సమయం ప్రతినిధి):** బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా వంటి సామాజిక దురాచారాలను అరికట్టి ప్రతి చిన్నారికి విద్య హక్కును కల్పించడమే "ఆపరేషన్ ముస్కాన్-12" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ శ్రీమతి డి. జానకి, ఐపీఎస్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆపరేషన్ ముస్కాన్--12 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జూలై 1 నుంచి జూలై 31 వరకు నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో 18 సంవత్సరాల లోపు బాలబాలికలను గుర్తించి, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, బలవంతపు భిక్షాటన, గృహ పనులు మరియు ఇతర ప్రమాదకర పనుల్లో నిమగ్నమైన పిల్లలను రక్షించి తిరిగి విద్యా సంస్థల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టవిరుద్ధమని, అలా చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రతి చిన్నారి విద్యను అభ్యసించే హక్కును కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే పోలీసు శాఖ, చైల్డ్‌లైన్ లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై బాలల భవిష్యత్తును పరిరక్షించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బీ. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ రమణ రెడ్డి, సీడబ్ల్యూసీ చైర్మన్ నయీముద్దీన్, కార్మిక శాఖ అధికారులు, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్త నేమ్ ... చైతన్యకు కలిసొస్తుందా...

**హైదరాబాద్ :** ఒకప్పుడు అక్కినేని ఫ్యామిలీకి చాలా మంచి క్రేజ్ ఉండేది. నాగేశ్వరరావు ఎన్నో వైవిధ్యమైన పాత్రలను చేసి ప్రేక్షకుల్లో విశేషమైన ఆదరణను సంపాదించుకున్నాడు. ఎన్టీఆర్ తో పాటు పోటీపడి నటించి ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నాడు. ఇక ఆయన తర్వాత తన నట వారసుడిగా ఇండస్ట్రీ ఎంట్రీ ఇచ్చిన నాగార్జున సైతం ఇండస్ట్రీలో ఉన్న టాప్ హీరోల్లో తను కూడా ఒకడిగా ఎదిగాడు. ఇక ఇలాంటి క్రమంలోనే ఆ ఫ్యామిలీ నుంచి వచ్చిన మూడోతరం హీరోలు ఎంత మాత్రం వాళ్ళ సత్తాను చాటులేక పోతున్నారు. కారణం ఏంటి అంటే వాళ్ళు ఎంచుకున్న సబ్జెక్టులు ప్రేక్షకులను ఏమాత్రం అట్రాక్ట్ చేయలేకపోతున్నాయి. మిగతా హీరోలతో పోలిస్తే వీళ్ళు చాలా వరకు వెనుకబడిపోయారనే చెప్పాలి. ఇలాంటి క్రమంలోనే అఖిల్ ప్రస్తుతం లెనిన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు.ఈ సినిమాతో ఎలాగైనా సరే తనకంటూ ఒక స్టాండర్డ్ ను ఏర్పాటు చేసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు. దానికోసమే ఆయన శతవిధాల కష్టపడుతున్నాడు. ఇక దాంతో పాటుగా తన పేరును నాగ అఖిల్ అని మార్చుకున్నట్టుగా కూడా తెలుస్తుంది. లెనిన్ మూవీ టైటిల్ లో నాగ అఖిల్ గా మనం చూడబోతున్నాం. వాళ్ల ఫ్యామిలీ లో ఉన్న హీరోలందరికి నాగ అనేది వస్తే సక్సెస్ సాధిస్తారు.

# ఇసుక మాఫియాపై రాజీ లేదు.. అక్రమాలకు పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టం

**జడ్చర్ల , జూలై 7, సమయం ప్రతినిధి :** జడ్చర్ల నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, గత పదేళ్లతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే అత్యధిక కేసులు నమోదు చేసి అక్రమాలపై ఉక్కుపాదం మోపినట్లు జడ్చర్ల శాసనసభ్యులు శ్రీ జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలింపుపై సమాచారం అందడంతో పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, చట్టపరమైన చర్యలు చేపట్టారని తెలిపారు. అక్రమాలకు పాల్పడే వారెవరైనా చట్టం ముందు సమానమేనని, ఎలాంటి రాజకీయ లేదా వ్యక్తిగత ఒత్తిళ్లకు తావులేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన కుటుంబ సభ్యులపై జరుగుతున్న అసత్య ప్రచారాలను ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. "మా కుటుంబ సభ్యులు ఎవరూ అక్రమ కార్యకలాపాలకు పాల్పడరు. ఒకవేళ ఎవరైనా చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నేనే అధికారులను కోరుతాను. అక్రమాలకు ఎలాంటి మద్దతు ఉండదు" అని స్పష్టం చేశారు. జడ్చర్ల నియోజకవర్గంలోని దుందుభి వాగులతో పాటు ఇతర వాగుల్లో ప్రస్తుతం ఇసుక అందుబాటులో లేకపోవడానికి గత పదేళ్లలో జరిగిన విచ్చలవిడి అక్రమ

నా కుటుంబంపై నిరాధార ఆరోపణలు మానుకోవాలి..ఇసుక మాఫియాను అరికట్టడంలో ప్రభుత్వం కట్టుదిట్టం
తప్పుడు ప్రచారాలపై చట్టపరమైన చర్యలు తప్పవు
గత పదేళ్లతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వంలోనే ఇసుక అక్రమాలపై అత్యధిక కేసులు
రాజకీయ లబ్ధి కోసం అసత్య ప్రచారాలు చేయొద్దు.. నా ఇమేజ్ డ్యామేజ్ చేసే వారిపై కఠిన చర్యలు
ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాలు మానాలి.. అక్రమార్కులపై కఠిన చర్యలు కొనసాగుతాయి: ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



తవ్వకాలే కారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వానికి ఎంత ఆదాయం వచ్చింది, ఎన్ని కేసులు నమోదయ్యాయో లెక్కలు పరిశీలించాలని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం, నమోదైన కేసుల వివరాలను కూడా ప్రజల ముందుంచాలని సూచించారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నియోజకవర్గంలో ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని, అక్రమాల నియంత్రణలో ప్రభుత్వం విజయవంతమైందని తెలిపారు.కొంతమంది వ్యక్తులు కావాలనే తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో తన కుటుంబ సభ్యులను ఇసుక మాఫియాతో ముడిపెడుతూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఇలాంటి దుష్ప్రచారాలు, నిరాధార ఆరోపణలు కొనసాగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజలు వాస్తవాలను మాత్రమే విశ్వసించాలని, తప్పుడు ప్రచారాలను నమ్మి అపోహలకు గురికావద్దని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి (జూలై 7):** వర్షాకాలంలో ప్రబలే కాలానుగుణ వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, అతిసార వ్యాధులు తదితర వ్యాధులను అరికట్టేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్రీ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా వైద్య ఆరోగ్య, మున్సిపల్, పంచాయతీరాజ్, గ్రామపంచాయతీ, ఐటీడీఏ తదితర శాఖలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వైద్య ఆరోగ్య, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ..... వర్షాకాలంలో వాతావరణ మార్పులు, నిల్వ నీరు, అపరిశుభ్ర పరిసరాల కారణంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు వేగంగా విస్తరించే అవకాశం ఉంటుందని, ప్రతి శాఖ తమ పరిధిలో నివారణ చర్యలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ ఫీవర్లు, అతిసార వ్యాధులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్య సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా అందేలా అవసరమైన మందులు, వైద్య సిబ్బంది, మొబైల్ మెడికల్ బృందాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు తక్షణ వైద్య




సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల్లో అవసరమైన మందులు, అత్యవసర వైద్య సామగ్రి, పరీక్షా కిట్లు, ఐవీ ఫ్లూయిడ్స్ తదితరాలను తగినంతగా నిల్వ ఉంచాలని చెప్పారు. జ్వరాల కేసులు నమోదైన వెంటనే రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని, అనుమానాస్పద కేసులను ఆలస్యం చేయకుండా ఉన్నత వైద్య కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు ఉండాలని సూచించారు. మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కాలువలు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, నిల్వ నీరు లేకుండా చర్యలు చేపట్టడం, చెత్తను సకాలంలో తొలగించడం, తాగునీటి వనరులను పరిశుభ్రంగా ఉంచడం వంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని, దోమల నివారణ కోసం యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యక్రమాలను శాస్త్రీయంగా నిర్వహించాలని

**అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి, ఏజెన్సీ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి... వైద్య సేవలు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

స్పష్టం చేశారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం కూడా అత్యంత కీలకమని, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ, తాగునీటి వినియోగం, దోమల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జ్వరం, వాంతులు, విరేచనాలు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని ప్రజలకు సూచించాలని చెప్పారు. వర్షాకాలంలో అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే స్పందించేలా వైద్య ఆరోగ్య శాఖ బృందాలను సిద్ధంగా ఉంచాలని, ప్రతి మండలంలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యటనలు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ, డిపిఓ శ్రీరాములు, ఇమినైజేషన్ అధికారి డాక్టర్ రవి నాయక్, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, పంచాయతీరాజ్, గ్రామపంచాయతీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ప్రభుత్వ విప్



**( సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) :** ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ నగరంలోని మెట్టుగడ్డ ప్రాంతంలో ఉన్న సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యాలయంలో నిర్వహించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యోగులుగా సేవలందించిన కాలంలో ప్రజల ప్రయాణ సౌకర్యాల కోసం మీరు చేసిన కృషి అపారమని కొనియాడారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా విధి నిర్వహణలో మీరు చూపిన నిబద్ధత, కర్తవ్యనిష్ఠ ఎంతో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలో మీరు గడిపిన అనుభవం, ప్రస్తుతం సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని, ముఖ్యంగా మహబూబ్ నగర్ అభివృద్ధి దిశగా మీ సూచనలు, ఆలోచనలు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి నెలలో ఒక రోజు ఫోరం కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటాయని, అందుకే వారికి సమీపంలోనే వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం అవసరమని పేర్కొన్నారు. అలాగే, అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ (CMRF) ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అవసరమైన వారికి తక్షణ సహాయం అందేలా అధికారులతో సమన్వయం చేస్తానని హామీ ఇచ్చారు. విశ్రాంత ఉద్యోగులకు ప్రస్తుతం అందుతున్న పెన్షన్ చాలా తక్కువగా ఉందని, వారి జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని పెన్షన్ పెంపు అవసరం ఉందని అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లి, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా సేకరించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. మీరు ప్రభుత్వానికి సేవ చేసిన వారిగా, ఇప్పుడు సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు. యువతకు మీ అనుభవాన్ని పంచి, సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో పలువురు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే గారిని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కార్పొరేటర్ ప్రశాంత్, సల్మాన్ , నాయకులు అబ్దుల్ హక్ , సతీష్, బాను, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షులు రాజాసింహుడు, కార్యదర్శి కె.రవీందర్ రెడ్డి, సీనియర్ సిటిజన్స్ ఫోరం నాయకులు జగపతి రావు, నాగభూషణం, అంజన్న , నాంజనేయులు, పి. హేమంత్ కుమార్, ఆర్ నారాయణ, అబ్దుల్ కరీం, వహీద్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల్లో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

**నారాయణపేట :** నారాయణపేట జిల్లా, మక్తల్, మండలం, MRPS 32 వ ఆవిర్భావ దినోత్సవ మరియు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది.మక్తల్ నియోజకవర్గం లో మక్తల్ టౌన్ అధ్యక్షులు గొలపల్లి జ్ఞాన ప్రకాష్ మాదిగ మాట్లాడుతూ.. పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ గారు భారత రాజ్యాంగంలోని షెడ్యూల్ కులాల్లోని పదిహేను శాతం రిజర్వేషన్లు ఎవరి జనాభా ఎంతో వారివాటా అంతా అని జనాభా నిష్పత్తి రిజర్వేషన్లను వర్గీకరించాలని 1994లో జులై 7న.మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని స్థాపించి ఎస్సీల వర్గీకరణ సాధనకై 30 సంవత్సరాలు సుదీర్ఘంగా పోరాటం చేసి వర్గీకరణ సాధించుకోవడం జరిగింది ఇట్టి విషయంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని కొంతమంది ప్రాణ త్యాగాలు కూడా చేయడం జరిగింది జాతి ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు ఈ సందర్భంగా వారికి జోహార్లు కూడా తెలియడం జరుగుతుంది ఎస్సీలు వర్గీకరణ సాధించుకున్న ఫలాలు మా జాతి బిడ్డలు అన్ని రంగాల్లో అందిపుచ్చుకొని విజయ పదంలో నడిచి నడిచి అభివృద్ధనడిచ్చి ప్రయాణించాలని మందకృష్ణ మాదిగ గారు కలలు కన్నటువంటి జాతి అభివృద్ధి విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో మన జాతి అగ్రస్థానంలో నిలబడాలని మనస్ఫూర్తిగా వారు కోరుకున్నారు .ఆ దిశగా మనమందరం కూడా మన పిల్లలు ఉన్నత విద్య చదివించి మన సాధించిన హక్కులను పొందాలని సందర్భంగా ఈ సందర్భంగా వారు కోరారు. మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా పండ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు.



MRPS నాయకులు తేజ మాదిగ, కృష్ణ మండల నాయకులు వెంకటేష్ మాదిగ, జగ్గాలీ అంజి మాదిగ,gpp సీనియర్ నాయకులు రాముమాదిగ, కర్రెమ్ శివరాజు మాదిగ, అంజి ( కాప్పమాదిగ,) గొలపల్లి నరేందర్ మాదిగ, (గొలపల్లి నరేష్ మాదిగ, గడ్డ) భీమేశ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై లైంగిక దాడి - నిందితుడికి 10 ఏళ్ల కఠిన జైలు శిక్ష, రూ.10,000/- జరిమానా!



**(సమయం గద్వాల) :** మైనర్ బాలిక పై బలత్కారం చేసిన కేసులో నిందితుడికి 10 సంవత్సరా ల కఠిన కారాగారా జైలు శిక్ష మరియు 10,000/- రూపాయాల జరిమాన విధిస్తూ గౌరవ స్పెషల్ సెషన్స్ జడ్జ్ - కం- ఫోక్సో కోర్టు గద్వాల, జడ్జ్ శ్రీ వి. శ్రీనివాస్ ఈ రోజు తీర్పును వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు, తెలిపారు.వడ్డేపల్లి మండలలో ఒక గ్రామమనికి చెందిన, ఒక మైనర్ బాలిక తల్లి తేది: 01.01.2021 రోజున శాంతినగర్ పోలీస్ స్టేషన్ కు వచ్చి అదే రోజున మైనర్ అయిన తన కూతురుపై వడ్డేపల్లి మండలంలోని ఒక గ్రామానికి చెందిన వ్యక్తి నడిపి తిమ్మప్ప s/o మునక తిక్కయ్య, 38 అను అతను బలాత్కారం చేసి అత్యాచారం చేసినట్టు పిర్యాదు ఇవ్వగా అప్పటి శాంతినగర్ ఎస్సై శ్రీహరి కొండ, క్రైమ్ Hîo. 01/2021, u/s: 366-A, 376(2)(2)(j) 376(2)(l)IPC &sec 5(k), 6 of POCSO Act -2012 గా కేసు నమోదు చేయడం జరిగింది. అప్పటి సిఐ. జె. వెంకటేశ్వర్లు తేది: 22-09-2021 రోజున పై నేరస్థుడుని రిమాండ్ పంపి, విచారణ పూర్తి చేసి తేది: 23-10-2021 రోజున కోర్టు లో చార్జి షీట్ వెయ్యడం జరిగింది. కోర్టు లో ట్రయల్స్ నడుస్తున్న సమయంలో జిల్లా అదనపు ఎస్పీ కె. శంకర్ ఆదేశాల మేరకు డి.ఎస్పి. వై. మొగిలయ్య పర్యవేక్షణలో, శాంతినగర్ సీఐ శంకర్, నాగశేఖర్ రెడ్డి, గద్వాల భరోసా కేంద్రం బృందం సాక్షులను పకడ్బందీగా బ్రీఫింగ్ చేసి తగిన చర్యలు తీసుకొని నేరస్తులను కోర్టులో ప్రవేశపెట్టగా పూర్వపరాలను స్పెషల్ సెషన్స్ జడ్జ్ - కం- ఫోక్సో కోర్టు గద్వాల, జడ్జ్ శ్రీ వి. శ్రీనివాస్ నిందితుడుకి 10 సంవత్సరాల కఠిన కారాగర శిక్ష జైలు శిక్ష మరియు 10,000/- వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కోర్టులో నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన అప్పటి ఐ.ఓ. లు శ్రీహరి కొండ ఎస్సై జె వెంకటేశ్వర్లు సిఐ, ప్రస్తుత గద్వాల డి. ఎస్పీ మొగిలయ్య, శాంతినగర్ సీఐ శంకర్, శాంతినగర్ ఎస్సై నాగ శేఖర్ రెడ్డి, అడిషనల్ పిపి. కె.విజయ్ కుమార్, గద్వాల భరోసా కేంద్రం బృందం మరియు కోర్టు డ్యూటీ అధికారులు ఎస్సై జిక్కి బాబు, హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా, డ్యూటీ కానిస్టేబుల్ గౌస్ పీర్ లను జిల్లా ఎస్పీ శ్రీ టి.శ్రీనివాస రావు, అభినందించారు.

## అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి
## ఎంపీ పోరిక బలరాం నాయక్



**మహబూబాబాద్, జూలై 7, (సమయం ప్రతినిధి):** అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని మహబూబాబాద్ ఎంపీ, దిశా కమిటీ చైర్మన్ పోరిక బలరాం నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన దిశా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, వ్యవసాయం, వైద్యం, విద్య, గృహ నిర్మాణం, రహదారులు, తాగునీరు, ఉపాధి, పంచాయతీరాజ్, మున్సిపల్, పరిశ్రమలు, బ్యాంకింగ్ తదితర 90 అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలో పట్టణాభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు పంట మార్పిడి, సాయిల్ హెల్త్ కార్డుల వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని, హెచ్ఐవీ, టిబి, మధుమేహం, తలసేమియా వంటి వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలని, అవసరమైన చోట రైల్వే అండర్‌పాస్‌లు, ఆర్ఓబీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ విప్ డా. జాటోత్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. ఉపాధి హామీ పనులను షెడ్యూల్ ప్రకారం అమలు చేయాలని, ఇరిగేషన్ శాఖ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. విద్యాశాఖలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అమలు, మైనింగ్ శాఖ నిబంధనల ప్రకారం పని చేయడం, నిరుద్యోగ యువతకు పీఎంఈజీపీ, పీఎం ఎఫ్ఎంఈ, స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ వంటి పథకాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని అన్నారు. అలాగే పాత విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు ప్రమాద ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తదాంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. యూరియా కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, స్వయం సహాయక సంఘాల ద్వారా డ్రోన్ల సహాయంతో నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, పంట మార్పిడి, ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు, అధిక ఆదాయం వచ్చే వాణిజ్య పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై సంబంధిత అధికారులు లిఖితపూర్వక నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె అనిల్ కుమార్, స్థానిక సంస్థలు హౌసింగ్ పీడీ పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, దిశా కమిటీ సభ్యులు, మహబూబాబాద్, డోర్నకల్, కేసముద్రం, మరిపెడ మున్సిపల్ చైర్‌పర్సన్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న దండోరా నర్సింహులును పరామర్శించిన ప్రభుత్వ విప్

**మహబూబ్ నగర్ :** నగరంలోని బోయపల్లి ప్రాంతానికి చెందిన దండోరా నరసింహులు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరసింహులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యులు సూచించిన విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులు, నాయకులు అబ్దుల్ హక్, సతీష్,బాను, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జడ్చర్ల ఎస్ఐ జయప్రసాద్‌ను అభినందించిన ఎస్పీ




**జడ్చర్ల , జూలై 7, సమయం ప్రతినిధి :** జోనల్ లెవల్ పోలీస్ డ్యూటీ మీట్-2026-27లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపికైన జడ్చర్ల ఎస్ఐ జయప్రసాద్‌ను జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా అదే పట్టుదలతో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జోన్‌కు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జయప్రసాద్‌కు ప్రశంసాపత్రం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# జడ్చర్లలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మీయ కలయిక

## ఎమర్జెన్సీ సహచరుడు మంచేన గుండేరావును పరామర్శించిన మాజీ గవర్నర్



**జడ్చర్ల , జూలై 7, సమయం ప్రతినిధి:** మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో తన ఎమర్జెన్సీ కాలం నాటి సహచరుడు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమకారుడు శ్రీ మంచేన గుండేరావు గారిని వారి నివాసంలో కలిసి ఆప్యాయంగా పరామర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న సందర్భంగా మార్గమధ్యంలో జడ్చర్లలో ఆగిన దత్తాత్రేయ , 1975 ఎమర్జెన్సీ సమయంలో మీసా (వీ×ూూ) చట్టం కింద తనతో పాటు అరెస్టై చంచల్‌గూడ జైలులో నిర్బంధ జీవితం గడిపిన శ్రీ గుండేరావును కలిసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగిన పోరాటమే తమను కలిపిందని, ఆ సమయంలో ఏర్పడిన స్నేహబంధం నేటికీ కొనసాగుతుండటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.అనంతరం శ్రీ మంచేన గుండేరావు ని శాలువాతో ఘనంగా సత్కరించిన ఆయన, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం శ్రీ గుండేరావు చేసిన త్యాగాలు, దేశభక్తి, విలువల పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ప్రశంసించారు. శ్రీ గుండేరావు కేవలం ఎమర్జెన్సీ పోరాట యోధుడే కాకుండా, ప్రముఖ సాహితీవేత్త, కవి, ఆధ్యాత్మిక చింతన కలిగిన వ్యక్తిగా సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. 83 ఏళ్ల వయస్సులోనూ ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో అదే ఉత్సాహంతో చురుకుగా పాల్గొంటూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడి ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు ఎడ్ల అమర్నాథ్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రాపోతుల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ సీతారాం జోహార్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహితీ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు ముచ్చర్ల కృష్ణయ్య, పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రయ్య, కిసాన్ మోర్చా నాయకులు మురళీకృష్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి



**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి జూలై 7:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల కల్పన, బోధన నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రమేష్ కుమార్ మంగళవారం ఉప్పునుంతల, వంగూరు మండలాల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల భోజన ప్రమాణాలను పరిశీలించిన ఆయన విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, తరగతి గదుల నిర్వహణ, బోధనా విధానాలు, నిర్మాణ పనుల పురోగతిపై ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా ఉప్పునుంతల మండలంలోని తాడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యార్థులకు టైలు, బెల్టుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వయంగా టైలు, బెల్టులను పంపిణీ చేసి వారితో ముచ్చటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై ఉపాధ్యాయులు బోధించే ప్రతి అంశాన్ని శ్రద్ధగా అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి, పోల్కంపల్లి ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన డీఈఓ రమేష్ కుమార్ తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి నేర్చుకునే సామర్థ్యాన్ని అంచనా వేశారు. బోధనలో మరింత నాణ్యత పెంపొందించే దిశగా ఉపాధ్యాయులు వినూత్న పద్ధతులను అవలంబించాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాలల హాజరు నమోదులను పరిశీలించిన ఆయన విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల హాజరు శాతంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు పెరిగేలా తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవాలని, పాఠశాలలకు క్రమం తప్పకుండా వచ్చేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి విద్యలో వెనుకబడకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల పనులను కూడా డీఈఓ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి విద్యార్థుల వినియోగానికి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి, విద్యా ప్రమాణాల పెంపునకు ప్రాధాన్యత ఇస్తోందని, ఉపాధ్యాయులు కూడా అదే స్థాయిలో బాధ్యతతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలని డీఈఓ రమేష్ కుమార్ అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. డీఈఓ రమేష్ కుమార్ వెంట సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీత్లా పండుగ

### పంటల సమృద్ధి కోసం సీతా భవానికి ప్రత్యేక పూజలు



**మహబూబాబాద్, జూలై 07, (సమయం ప్రతినిధి) :** ప్రతి ఏడాది పెద్దపుష్య కార్తెలో జరుపుకునే ఈ పండుగ లంబాడీల చిరకాల సంప్రదాయమని గ్రామ సర్పంచ్ బాదావత్ కమ్లి పుల్య నాయక్, ఉప సర్పంచ్ భూక్యా కల్పన భరత్, మాజీ సర్పంచ్ పున్నం నాయక్, కాంగ్రెస్ నాయకులు రంజిత్ నాయక్, దేవేందర్ నాయక్ అన్నారు. జిల్లాలోని కురవి మండలం బంచరాయితండ గ్రామంలో గిరిజన లంబాడీల తొలి సాంప్రదాయ పండుగ సీత్లా (సీతా భవాని)ను భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ తొలకరి విత్తనాలు వేసిన తర్వాత సీతా భవానిని పూజించడం ద్వారా మంచి వర్షాలు, సమృద్ధిగా పంటలు, పశుసంపద అభివృద్ధి కలగాలని గిరిజనులు ప్రార్థిస్తారన్నారు. ఇందులో భాగంగా అమ్మవారికి గొర్రెలు, మేకలను సమర్పించి, నవధాన్యాలను పశువులపై చల్లి వాటిని దాటించే దాటుడు పండుగ ఆచారాన్ని నిర్వహిస్తామని, దీని ద్వారా పశువులకు ఏడాది పొడవునా రోగాలు రాకుండా, పంటలు అధిక దిగుబడినిస్తాయని విశ్వాసం. సీతా భవానితో పాటు మేరామా, తుల్లా, కేంకాళీ, హింగళ, ద్వాలంగర్, మంత్రాళ్ అనే ఏడుగురు దేవతలను, వారి తమ్ముడు లుంకడియాను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. బెల్లంతో తయారుచేసిన లాప్సి, నవధాన్యాలు, ఉల్లిగడ్డలు, పచ్చిమిర్చి, ఎండుమిర్చి వంటి నైవేద్యాలు సమర్పించారు. లంబాడీ మహిళలు సంప్రదాయ పులియా గోన్ను ధరించి పూజల్లో పాల్గొనగా, తండా పూజారి ఉదయం నుంచి పండుగ ముగిసే వరకు ఉపవాస దీక్షతో సేవలందించారు.

## నేడు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన



**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి జూలై 7 :** ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలి, ప్రోటోకాల్, భద్రత, ట్రాఫిక్, పారిశుధ్య ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావు ఉండొద్దు, అధికారులకు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశం,రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో చేపట్టనున్న పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. పర్యటన సందర్భంగా నిర్వహించనున్న ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, ప్రజా కార్యక్రమాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, శాసనమండలి సభ్యులు కూచుకుళ్ల దామోదర్ రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు.మొదటగా నాగర్‌కర్నూల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన జిల్లా రవాణా శాఖ (ఆర్టీఓ) కార్యాలయ భవనాన్ని సందర్శించిన కలెక్టర్, ప్రారంభోత్సవ కార్యక్రమానికి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమ వేదిక, అతిథుల కూర్చునే ఏర్పాట్లు, పార్కింగ్, తాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, మీడియా ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు, ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.అనంతరం నాగర్‌కర్నూల్ పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ఆర్టీసీ బస్ స్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగే స్థలాన్ని పరిశీలించారు. శంకుస్థాపన కార్యక్రమం నిరాటంకంగా జరిగేలా స్థలాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని, ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....., బుధవారం నాగర్ కర్నూల్ జిల్లాలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటనలో ఎలాంటి చిన్నపాటి లోపం కూడా జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వ ప్రోటోకాల్ నిబంధనలను ఖచ్చితంగా పాటించడంతో పాటు ప్రతి అంశాన్ని ముందుగానే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని పటిష్టమైన భద్రతా బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని, కార్యక్రమ ప్రాంగణాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. పర్యటన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు, నాగర్‌కర్నూల్‌లో నూతన ఆర్టీసీ బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఆయా కార్యక్రమాలు విజయవంతంగా జరిగేలా జిల్లా యంత్రాంగం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి ఇమ్రాన్ మహమ్మద్, నాగర్ కర్నూల్ డిఎం యాదగిరి, అధికారులు, రవాణా శాఖ అధికారులు, టీజీఎస్ఆర్టీసీ అధికారులు, రోడ్లుభవనాల శాఖ ఇంజినీర్లు, పోలీసు అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దృష్టి లోపం ఉన్న చిన్నారులకు డిజిటల్ లిటరసీ కిట్ల పంపిణీ చేసిన ప్రభుత్వ విప్



**( సమయం ప్రతినిధి మహబూబ్నగర్ ):** మహబూబ్‌నగర్‌లో దృష్టి లోపం ఉన్న చిన్నారుల కోసం డిజిటల్ లిటరసీ కిట్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. " ఎక్ కదమ్ ఔర్ ఫౌండేషన్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ హెల్త్" ఆధ్వర్యంలో అమలవుతున్న 'అరుణోదయ (Sunrise for the Blind)µ కార్యక్రమం భాగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 5 నుండి 17 సంవత్సరాల వయస్సు గల దృష్టి లోపం ఉన్న చిన్నారులకు డిజిటల్ లిటరసీ కిట్లను ఆయన అందజేశారు. ప్రతి కిట్‌లో స్మార్ట్‌ఫోన్, బ్లూటూత్ కీబోర్డ్, హెడ్‌సెట్, అబాకస్ వైట్ కేన్ వంటి పరికరాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో దివ్యాంగ చిన్నారులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో కీలకమని, దీనివల్ల వారు విద్య, ఉపాధి మరియు స్వతంత్ర జీవనంలో ముందుకు సాగగలరని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా దృష్టి లోపం ఉన్న చిన్నారుల అభివృద్ధికి విశిష్ట సేవలు అందిస్తున్న "ఎక్ కదమ్ ఔర్ ఫౌండేషన్" కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం చిన్నారుల్లో డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడం, సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకురావడం, స్వతంత్ర జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం మరియు సమాజంలో సమాన అవకాశాలను కల్పించడం అని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. అదేవిధంగా, ఈ కార్యక్రమం ద్వారా చిన్నారులకు డిజిటల్ అక్షరాస్యత, సహాయక పరికరాల వినియోగం, వ్యక్తిగత శిక్షణ, ఓరియంటేషన్ అండ్ మొబిలిటీ, దైనందిన జీవన నైపుణ్యాలు మరియు తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీను, జిల్లా కోఆర్డినేటర్ వెంకటేష్, తెలంగాణ మాస్టర్ ట్రైనర్ సురేందర్, శ్యాంసుందర్ తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు చిన్నారులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

### డీఎస్పీ గండ్రాతి మోహన్



**మహబూబాబాద్, జూలై 7, (సమయం ప్రతినిధి) :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని మహబూబాబాద్ డీఎస్పీ గండ్రాతి మోహన్, సీఐ సత్యనారాయణ అన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎన్డీపీఎస్ చట్టం కింద నమోదైన కేసుల్లో స్వాధీనం చేసుకున్న భారీ పొడి గంజాయిని మంగళవారం చట్టప్రకారం పూర్తిగా దగ్ధం చేశారు. రాష్ట్ర పోలీస్ శాఖ 'ఈగల్' (ఎలీట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్ఫోర్సమెంట్ ) ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ చేపట్టారు.

మహబూబాబాద్ జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ సమావేశమై, న్యాయస్థానం అనుమతితో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.64,24,800 విలువైన 128.496 కిలోల గంజాయిని నిబంధనల ప్రకారం నాశనం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు డీఎస్పీ గండ్రాతి మోహన్, సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసు బృందం వరంగల్‌లోని కాకతీయ మెడికల్ వేస్ట్ యూనిట్‌లో ప్రత్యేక యంత్రాల సహాయంతో గంజాయిని పూర్తిగా దగ్ధం చేసింది. ఈ సందర్భంగా డీఎస్పీ గండ్రాతి మోహన్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, వినియోగంపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల సరఫరా లేదా అక్రమ కార్యకలాపాలపై ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సమాజంలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.

# పునరావాస కేంద్రాన్ని అభివృద్ధి చేయాలి

## జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్





**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి (జూలై 7):** అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని అటవీ గ్రామాల ప్రజల స్వచ్ఛంద పునరావాసం కోసం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం బాచారం గ్రామం వద్ద నిర్మిస్తున్న పునరావాస (ఆర్ & ఆర్) కాలనీ పనులను, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సార్లపల్లి, కుడిచింతల బైలు, తాటిగుండాల పెంట, కొల్లంపెంట గ్రామాలకు చెందిన ఫేజ్-I (ఆప్షన్-II) లబ్ధిదారుల కోసం ఏర్పాటు చేస్తున్న కాలనీకి సంబంధించిన సమగ్ర లేఅవుట్ మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి లబ్ధిదారునికి గృహ స్థలాలు, విశాలమైన అంతర్గత రహదారులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, పారిశుద్ధ్య సదుపాయాలు, వర్షపు నీటి పారుదల వ్యవస్థలను నాణ్యతతో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రం, కమ్యూనిటీ హాల్, గ్రామ పరిపాలనా కార్యాలయం, రేషన్ దుకాణం, పార్కు, ఆట స్థలం వంటి సామాజిక మౌలిక సదుపాయాలను సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కాలనీని అన్ని సౌకర్యాలతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని అటవీ గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా పునరావాసాన్ని ఎంచుకున్న నేపథ్యంలో, వారికి కొత్త ప్రాంతంలో మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, రవాణా, విద్యుత్, ఉపాధి అవకాశాలు వంటి అన్ని ప్రాథమిక సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా కాలనీని అభివృద్ధి చేయాలని సూచించారు. పునరావాస కాలనీ అభివృద్ధిలో అటవీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, రోడ్లు మరియు భవనాల శాఖలు సమన్వయంతో పనిచేసి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు లబ్ధిదారుల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు ప్రతిపాదిత లేఅవుట్, ప్లాట్ల విభజన, రహదారుల నిర్మాణం, తాగునీటి వనరులు, విద్యుత్ కనెక్షన్లు, ప్రజా వినియోగ స్థలాల కేటాయింపు తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు. అవసరమైన చోట మార్పులు చేసి లబ్ధిదారులకు మరింత అనుకూలంగా కాలనీ రూపకల్పన చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## జులై10న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి: పి డి ఎస్ యు,డి వై ఎఫ్ ఐ, ఏ ఐ వై ఎఫ్ విద్యాశాఖ మంత్రిని నియమించాలి

అమరచింత : అమరచింత మండలం కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో PDSU, DYFI AIYF విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 10 న జరిగే విద్యాసంస్థల బంద్ ని జయప్రదం చేయాలని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. విద్యార్థుల సమస్యలను పూర్తిగా విస్మరించి, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని వెంటనే మార్చుకోవాలని PDSU జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ DYFI జిల్లా అధ్యక్షులు . రాఘవేంద్ర AIYF జిల్లా కార్యదర్శి కుతూబ్ డిమాండ్ చేశారు.అమరచింత మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను వెంటనే నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ మరియు ఆత్మకూరు డిగ్రీ కళాశాలకు బస్ సౌకర్యం కల్పించాలి. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అధ్యాపకుల ఖాళీలు భారీగా పేరుకుపోయినా భర్తీ చేయడం లేదు.సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం,ప్రైవేటీకరణకు ప్రోత్సాహం ఇస్తూ పేద విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చుతోంది.ఎన్నికల సమయంలో విద్యారంగ అభివృద్ధిపై అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించింది. విద్యార్థుల సమస్యలపై స్పందించకుండా కాలయాపన చేయడం దురదృష్టకరం.

## మార్కెట్ భవన నిర్మాణానికి మంత్రి భూమి పూజ



**ఆత్మకూరు :** మక్తల్ నియోజకవర్గం ఆత్మకూరు పట్టణంలో 85 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న మార్కెట్ యార్డ్ కమిటీ భవన నిర్మాణానికి మంత్రి వాకిటి శ్రీహరి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు మార్కెట్ యార్డు చైర్మన్ రహమతుల్లా, రాష్ట్ర కల్లు గీత సహకార కార్పొరేషన్ వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్, మున్సిపల్ ఛైర్ పర్సన్ నాగమణి, వైస్ ఛైర్ పర్సన్ శ్రీనివాసులు, ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేష్, పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదాయం ఉన్నా సౌకర్యాలు సున్నా: మల్దకల్ తిమ్మప్ప స్వామి ఆలయంలో భక్తుల అవస్థలు



**సమయం ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వర స్వామి (తిమ్మప్ప) క్షేత్రంలో భక్తుల ఇబ్బందులు నానాటికీ ఐపోతున్నాయి. ముఖ్యంగా మహిళా భక్తుల పట్ల అధికారులు చూపిస్తున్న నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. ఏటా కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా, మహిళల కోసం కనీస మరుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**బహిర్భూమికి బయటికే.. పడరాని పాట్లు:**

మరుగుదొడ్ల కొరత: ఆలయ ప్రాంగణంలో మహిళల కోసం ప్రత్యేకంగా పనిచేసే మరుగుదొడ్లు ఒక్కటి కూడా లేవు. బహిరంగ ప్రదేశాలే దిక్కు: సుదూర ప్రాంతాల నుండి వచ్చే మహిళలు విధిలేక మరుగుదొడ్ల కోసం బయటి ప్రాంతాలకు, పొలాల వైపు వెళ్లాల్సి వస్తోంది.ఆత్మగౌరవానికి భంగం: కనీస ప్రైవసీ లేకపోవడంతో మహిళా భక్తులు తీవ్ర మానసిక క్షోభకు, అవమానానికి గురవుతున్నారు.రాత్రి వేళల్లో భయం: చీకటి పడితే భద్రత లేని బహిరంగ ప్రదేశాలకు వెళ్లడానికి మహిళలు బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది.

**పత్రికల్లో వచ్చినా మారని తీరు:**

ఈ ఘోరమైన సమస్యపై ఇప్పటికే అనేక పత్రికల్లో వార్తలు వచ్చాయి. స్థానికులు, భక్తులు మొరపెట్టుకున్నా అధికారుల తీరు మారలేదు. దేవాదాయ శాఖ అధికారులు కేవలం ఆదాయంపైనే దృష్టి పెడుతూ, మహిళల ప్రాథమిక అవసరాలను గాలికొదిలేశారని భక్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, యుద్ధప్రాతిపదికన మహిళల కోసం ఆధునిక మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

## అక్కడ బడికి హాజరు.. ఇక్కడ కోచింగ్‌లో విద్యార్థులు: గద్వాల విద్యాశాఖ అధికారులకు సవాల్ విసురుతున్న నిర్వహాకులు







**సమయం ప్రతినిధి:** జోగులాంబ గద్వాల గద్వాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా వెలిసిన ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు నిబంధనలను నిలువునా ఉల్లంఘిస్తున్నాయి. కేవలం ఉదయం, సాయంత్రం వేళల్లోనే నడపాల్సిన శిక్షణ తరగతులను, పాఠశాల వేళల్లోనే అడ్డగోలుగా నిర్వహిస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పగలే కోచింగ్ దందా:**

నిబంధనల ప్రకారం కోచింగ్ సెంటర్లను కేవలం ఉదయం 7 నుండి 9 గంటల వరకు, సాయంత్రం 5 నుండి 7 గంటల వరకు మాత్రమే నిర్వహించాలి. కానీ జిల్లా కేంద్రంలోని పలు కోచింగ్ సెంటర్లలో ఏకంగా పాఠశాలలు నడిచే పూర్తి సమయం అక్రమంగా క్లాసులు నడుపుతున్నారు. స్థానిక పాఠశాలల్లో విద్యార్థుల పేర్లను కేవలం రికార్డుల కోసమే నమోదు చేయించి, సదరు విద్యార్థులందరినీ రోజంతా ఈ అక్రమ సెంటర్లలోనే ఉంచి చదివిస్తున్నారు. పాఠశాల యాజమాన్యాలు, కోచింగ్ నిర్వాహకుల మధ్య ఉన్న రహస్య ఒప్పందాల వల్లే ఈ దందా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**సీజ్ చేయాలని డిమాండ్:**

ఈ విద్యా అక్రమాలపై పూర్తి సమాచారం ఉన్నప్పటికీ అధికారులు తనిఖీలు చేయడానికి వెనకాడుతున్నారు. నిర్వాహకుల రాజకీయ, ఆర్థిక బలాల వల్లే అధికారులు మౌనం వహిస్తున్నారని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఇలాంటి గుర్తింపు లేని సంస్థలపై తక్షణమే విచారణ జరిపి, వాటిని సీజ్ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంట: జిల్లా విద్యాశాఖ అధికారిని, జిల్లాలో అనుమతులు లేకుండా కోచింగ్ సెంటర్లు నడుస్తున్నట్టు మా దృష్టికి రాలేదనీ అలాంటి కోచింగ్ సెంటర్ లపై తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కోచింగ్ సెంటర్ లను మూసి వేస్తామన్నారు.

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, RANGA REDDY DISTRICT. T.G AT PRASHANTH NAGAR, KUKATPALLY, HYDERABAD DISPUTE NO : 323 OF 2025.**

**BETWEEN :**

**M/S. MARGADARSI CHIT FUND PVT. LTD,**
MADHAPUR BRANCH.
.....DISPUTANT
AND
1) **MRS. FATHIMA BEGUM & OTHERS**
TO, ....OPPONENTS

**OPPONENT NO.01**

1) MRS. FATHIMA BEGUM W/O LATE MOHD ABDUL PASHA, D/O MOHD ISMAIL, DOB: 14.02.1967, W/AS: HELPER, EMP CODE : 10504, MATERIAL PRODUCTION DEPT, O/O. DR B R AMBEDKAR OPEN UNIVERSITY, ROAD NO. 10, NEAR MASJID-E-USMAN, SUN CITY, BANDLAGUDA JAGIR, HYDERABAD - 500091. MOB NO.8309610992.

**OPPONENT NO.02**

2) MR. MOHAMMED ABDUL IMRAN PASHA S/O LATE MOHD ABDUL PASHA, DOB: 12.07.1986, W/AS: OFFICE ATTENDANT, EMP CODE : 0228, ZOOLOGY DEPT, O/O. MOULANA AZAD NATIONAL UNIVERSITY, TELECOM NAGAR, GACHIBOWLI, HYDERABAD - 500032, R/O PLOT NI. 48, NARSA REDDY COLONY, ROAD NO.10, NEAR MASJID-E-USMAN, SUN CITY, BANDLAGUDA JAGIR, HYDERABAD-500091. MOB NO.8309610992, 8498086565.

**OPPONENT NO.03**

3) MR. MOHD IRFAN S/O MOHD ABDUL AHAD, DOB: 05.02.1979, W/AS: U D C, EMP CODE : 0217, EXAMINATION DEPT, O/O. MAULANA AZAD NATIONAL UNIVERSITY, TELECOM NAGAR, GACHIBOWLI, HYDERABAD500032. R/O QUARTER NO.12, TYPE - II, BLOCK A , MANUU STAFF QUARTERS, GACHIBOWLI, HYDERABAD - 500032. MOB NO.9701537030.

**OPPONENT NO.04**

4) MR.MD ASIF S/O MD IBRAHIM, DOB: 21.12.1979, W/AS: MAINTAINANCE ASST. EMP CODE : 810, ITI HYDERABAD DEPT, O/O. MAULANA AZAD NATIONAL UNIVERSITY, TELECOM NAGAR, GACHIBOWLI, HYDERABAD-500032. R/O H.NO. 9-4-134/A/24, ARUNA COLONY, TOLICHOWKI, HYDERABAD-500008. MOB NO. 7207535797.

**OPPONENT NO.05**

5) MRS.SYEDA SAFIA JEELANI W/O RAZA HUSSAIN, DOB: 14.01.1979, W/AS: L D C, EMP CODE : 215, DDE DEPT, O/O; MAULANA AZAD NATIONAL UNIVERSITY, TELECOM NAGAR, GACHIBOWLI, HYDERABAD-500032. R/O 18-80, RODA MESTRI NAGAR, GAJULARAMARAM ROAD, SHOPUR NAGAR, QUTHBULLAPUR MANDAL, MEDCHAL - MALKAJGIRI DIST-500055.

**OPPONENT NO.06**

6) MR. ERLAPALLY RUPAK KUMAR S/O ERLAPALLY KISTAIAH, DOB: 27.04.1976, W/AS: PERSONAL ASST. EMP CODE: 547, DEAN OFFICE, SCIENCE DEPT, O/O. MAULANA AZAD NATIONAL UNIVERSITY, TELECOM NAGAR, GACHIBOWLI, HYDERABAD-500032. R/O H.NO. 1-9-265, BACK SIDE MASJID, RAJENDRA NAGAR, RANGA REDDY DIST-500030. MOB NO. 9533967676.

**OPPONENT NO.07**

7) MR. SHAIK MOHIUDDIN S/O SHAIK KHALIDUDDIN, DOB: 29.01.1983, W/AS: L D C, EMP CODE: 291, ITI HYDERABAD DEPT, O/O. MAULANA AZAD NATIONAL UNIVERSITY, TELECOM NAGAR, GACHIBOWLI, HYDERABAD-500032. R/O M-III/28 QUARTERS, OSMANIA UNIVERSITY CAMPUS, JAMAI OSMANIA, HYD-500007, MOB NO.9966998910.

PLEASE TAKE NOTICE THAT THE ABOVE DISPUTE IS FILED AGAINST YOU FOR RECOVERY OF **RS. 8,08,497/- (RUPEES EIGHT LAKHS EIGHT THOUSAND FOUR HUNDRED AND NINETY SEVEN ONLY)** AND THE SAME IS POSTED TO **28/07/2026** FOR YOUR APPEARANCE BEFORE THE OFFICE OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, **RANGA REDDY DISTRICT. T.G. AT PRASHANTH NAGAR, KUKATPALLY, HYD AT. 12.00 P.M.** IF YOU FAIL TO ATTEND THE OFFICE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR ON THAT DAY THE MATTER WILL BE HEARD AND DECIDED EXPARTE.

**(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR)**

FOREMAN /BRANCH MANAGER
KUKATPALLY BRANCH

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, RANGA REDDY DISTRICT. T.G AT PRASHANTH NAGAR, KUKATPALLY, HYDERABAD DISPUTE NO : 322 OF 2025.**

**BETWEEN :**

**M/S. MARGADARSI CHIT FUND PVT. LTD,**
MADHAPUR BRANCH.
.....DISPUTANT
AND
1) **MR. MOHD ABDUL IMRAN PASHA & OTHERS**
TO, ....OPPONENTS

**OPPONENT NO.01**

1) MR. MOHAMMED ABDUL IMRAN PASHA S/O LATE MOHD ABDUL PASHA, DOB: 12.07.1986, W/AS: OFFICE ATTENDANT EMP CODE: 0228, ZOOLOGY DEPT, O/O: MAULANA AZAD NATIONAL UNIVERSITY, TELECOM NAGAR, GOCHIBOWLI, HYDERABAD-500032. R/O PLOT NO. 48, NARSA COLONY, ROAD NO. 10, NEAR MASJID - E-USMAN, SUN CITY, BANDLAGUDA JAGIR, HYDERABAD-500091. MOB NO.8309610992, 8498086565.

**OPPONENT NO.02**

2) MRS. FATHIMA BEGUM W/O LATE MOHD ABDUL PASHA, D/O MOHD ISMAIL, DOB: 14.02.1967, W/AS: HELPER, EMP CODE: 10504, MATERIAL PRODUCTION DEPT, O/O: DR B R AMBEDKAR OPEN UNIVERSITY, ROAD NO. 46, JUBILEE HILLS, HYDERABAD-500033. R/O PLOT NO. 48, NARSA REDDY COLONY, ROAD NO. 10, NEAR MASJID E USMAN, SUN CITY BANDLAGUDA JAGIR, HYDERABAD-500091. MOB NO. 8309610992.

**OPPONENT NO.03**

3) MR. SHAIK MOINUDDIN S/O SHAIK KHALIDUDDIN, DOB: 20.11.1985, W/AS: SUPERVISOR SECURITY, EMP CODE : 840 PROCTOR OFFICE DEPT, O/O. MAULANA AZAD NATIONAL UNIVERSITY, TELECOM NAGAR, GOCHIBOWLI, HYDERABAD-500032. R/O M-III/28 QUARTERS, OSMANIA UNIVERSITY CAMPUS, JAMAI OSMANIA, HYD-500007. MOB NO. 9966998910.

**OPPONENT NO.04**

4) MR.MOHD IRFAN S/O MOHD ABDUL AHAD, DOB: 05.02.1979, W/AS: U D C EMP CODE : 0217, EXAMINATION DEPT, O/O MAULANA AZAD NATIONAL UNIVERSITY, TELECOM NAGAR, GACHIBOWLI, HYDERABAD-500032. R/O QUARTER NO.12, TYPE-II, BLOCK A, MANUU STAFF QUARTERS, TELECOM NAGAR, GACHIBOWLI, HYDERABAD-500032. MOB NO. 9701537030.

PLEASE TAKE NOTICE THAT THE ABOVE DISPUTE IS FILED AGAINST YOU FOR RECOVERY OF **RS. 4,07,065/- (RUPEES FOUR LAKHS SEVEN THOUSAND AND SIXTY FIVE ONLY)** AND THE SAME IS POSTED TO **28/07/2026** FOR YOUR APPEARANCE BEFORE THE OFFICE OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, **RANGA REDDY DISTRICT. T.G. AT PRASHANTH NAGAR, KUKATPALLY, HYD AT. 12.00 P.M.** IF YOU FAIL TO ATTEND THE OFFICE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR ON THAT DAY THE MATTER WILL BE HEARD AND DECIDED EXPARTE.

**(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR)**

FOREMAN /BRANCH MANAGER
KUKATPALLY BRANCH

# విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పాత పద్ధతిన చెల్లించాలి

## పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్





**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ , తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ, బీసీ జేఏసీ నాయకులు గుజ్జ కృష్ణ, సురేష్, ఎస్సీ,ఎస్టీ, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నర్సింహ నాయక్ మరియు విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ....**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నాయకత్వంలో విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాడి, విద్యార్థుల త్యాగాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తు చేశారు. అలాంటి విద్యార్థులకే నేడు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో వేలాది మంది విద్యార్థులు తమ విద్యను కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మరోవైపు పెద్ద కాంట్రాక్టర్ల బిల్లులను వేగంగా చెల్లిస్తున్న ప్రభుత్వం, విద్యార్థుల బకాయిలను చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలోని ప్రైవేట్ కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తమ విద్యా సర్టిఫికెట్ల కోసం అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో పేద విద్యార్థులు పూర్తి ఫీజులు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థులపై రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు చేస్తామనడం అన్యాయమని, లక్షల కోట్ల రూపాయల ఆర్థిక నేరాలకు పాల్పడిన వారిపై అమలు చేయాల్సిన చర్యలను విద్యార్థులపై ప్రయోగించడం వారి భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పాత విధానంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అందాల పోటీలు, ఫుట్‌బాల్ కార్యక్రమాలు, మూసీ ప్రక్షాళన వంటి కార్యక్రమాలకు వందల కోట్ల రూపాయలు కేటాయిస్తున్న ప్రభుత్వం, విద్యార్థుల ఫీజు బకాయిలను మాత్రం విడుదల చేయకపోవడం దురదృష్టకర మన్నారు. విద్యార్థుల బకాయిలను చెల్లించడం ప్రభుత్వానికి పెద్ద భారం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే విద్యార్థి సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు.

## ఆశా కార్యకర్తల ఆత్మగౌరవాన్ని పెంపొందించే "ఆశా నిలయం" ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నిర్మాణం

**(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) :** గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో ఆశా కార్యకర్తలు కీలక భూమిక పోషిస్తున్నారు. తల్లీ–శిశు ఆరోగ్య పరిరక్షణ నుండి వ్యాధి నిరోధక చర్యల వరకు, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడం నుండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయడం వరకు వారి సేవలు అమూల్యమైనవి. ఈ నేపథ్యంలో వారి సేవలను గుర్తిస్తూ, వారికి గౌరవప్రదమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో తన ఎస్డీఎఫ్ నిధులతో ఆశా కార్యకర్తల కోసం " ఆశా నిలయం " నిర్మించారు. "ఆశా నిలయం" కేవలం విశ్రాంతి కేంద్రం మాత్రమే కాదు,ఆశా కార్యకర్తల ఆత్మగౌరవాన్ని పెంపొందించే ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి రోజు గ్రామాల నుంచి వందలాది మంది రోగులను ఆసుపత్రులకు తీసుకువచ్చి, వారికి ఆరోగ్య సేవలు అందేలా కృషి చేసే ఆశా కార్యకర్తలు మాత్రం ఆసుపత్రుల్లో ఎక్కువసేపు ఉండేందుకు సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రిలో ఉండే సెక్యూరిటీ సిబ్బంది కూడా వారిని ఎక్కువ సమయం ఆసుపత్రిలో ఉండనీయని పరిస్థితి, ఈ పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే , ఆశా కార్యకర్తల కోసం ప్రత్యేక విశ్రాంతి స్థలం అవసరమని భావించి, జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలోనే ఆశా నిలయాన్ని నిర్మించారు. రోజంతా కష్టపడి సేవలు అందించే ఆశా కార్యకర్తలకు విశ్రాంతి తీసుకునే స్థలం, సమావేశాలు నిర్వహించుకునే వేదిక, అవసరమైన సమాచారం పొందే కేంద్రంగా "ఆశా నిలయం" రూపుదిద్దుకుంది. ఇక్కడ వారు పరస్పరం కలుసుకుని అనుభవాలను పంచుకోవడం, కొత్త విషయాలు నేర్చుకోవడం కూడా సాధ్యమవుతోంది. ఈ కేంద్రంలో తాగునీరు, విశ్రాంతి గదులు, సమావేశాల కోసం ప్రత్యేక ప్రదేశం, శానిటేషన్ సదుపాయాలు వంటి ప్రాథమిక వసతులు కల్పించారు. అదేవిధంగా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు నిర్వహించేందుకు కూడా ఇది అనుకూలంగా ఉంటుంది. ఈ విధంగా ఆశా కార్యకర్తల పనితీరును మెరుగుపరచడంలో " ఆశా నిలయం " కీలక పాత్ర పోషించనుంది. అత్యంత ముఖ్యంగా, ఆశా కార్యకర్తలు సమాజంలో గౌరవంతో నిలబడేలా చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిలుస్తోంది. వారు ఎదుర్కొనే సవాళ్లను తగ్గిస్తూ, వారికి అవసరమైన మద్దతు అందించడం ద్వారా వారి సేవలను మరింత ప్రభావవంతంగా మార్చడం లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్ అమలు చేస్తున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి ప్రత్యేక చొరవ తీసుకుని ఈ "ఆశా విశ్రాంతి నిలయం"ను నిర్మించడం విశేషం. ఇది ఆశా కార్యకర్తల పట్ల ఆయన చూపుతున్న గౌరవానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ఆరోగ్య సేవలు మరింత బలోపేతం కావడంతో పాటు, ఆశా కార్యకర్తలకు ప్రోత్సాహం లభించి వారు మరింత ఉత్సాహంతో సేవలను కొనసాగించగలరని ఆశాభావం వ్యక్తమవుతోంది. సమాజ ఆరోగ్యాభివృద్ధిలో ఆశా కార్యకర్తల పాత్రను మరింత బలపరిచే ఈ " ఆశా నిలయం " ఒక ఆదర్శవంతమైన ముందడుగుగా నిలుస్తోంది.

## ఘనంగా మౌలాలి గందోత్సవం

ఆత్మకూరు : స్థానిక మున్సిపాలిటీ కేంద్రంలోని రాజా వీధిలోనీ మసీదులో ప్రతిష్టించిన కొడి పీర్ల ఉత్సవాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఇమామే మౌలాలి గందోత్సవంను గౌస్ సాహెబ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు కందూర్లు నిర్వహించి రాత్రి ఒకటి గంటలకు పట్టణంలోని పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగించారు. బుధవారం సాయంత్రం హసనే ఆలం, హుసేని ఆలం, ఇమామే ఖాసిం, ఇమామే జలాలి, పీర్లను భక్తులు ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. కొడి పీర్ల ఊరేగింపు చూసేందుకు పట్టణంలోని ప్రజలతో పాటు ఇతర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. కొడి పీర్ల ఉత్సవాల సందర్భంగా



ప్రత్యేక ఏర్పాట్లను చేపడుతున్నట్లు నిర్వాహకులు వెంకట్, రఘు, బాలరాజు, అశోక్, వెంకటేష్, శ్రీను, మణికంఠ, తిరుపతి, జహంగీర్, షకీల్, మహేష్, మోహన్, సల్మాన్, రాములు తెలిపారు




## నగర అభివృద్ధిలో యువత పాత్ర కీలకం : ప్రభుత్వ విప్


**(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్):** మహబూబ్ నగర్ నగర అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని మైత్రి నగర్‌లో ముడా నిధులు రూ.15 లక్షలతో నిర్మించనున్న మైత్రి యూత్ అసోసియేషన్ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహబూబ్ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే యువత చురుకైన భాగస్వామ్యం అవసరమని స్పష్టం చేశారు. సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడంలో యువత ముందుం డాలని, వారి శక్తిని సరైన దిశలో వినియోగిస్తే నగరం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రభుత్వం యువత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇలాంటి యూత్ అసోసియేషన్ భవనాలు యువతకు ఉపయోగకరంగా మారతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర డిప్యూటీ



మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కార్పొరేటర్ల పాండురంగారెడ్డి, రమేష్ బాబు , ఎస్ .శేఖర్, మైత్రి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ శ్రీనివాసులు, కార్యదర్శి మైత్రి యాదయ్య, నాయకులు ప్రశాంత్, అబ్దుల్ హక్, కృష్ణ కుమార్ రెడ్డి , తుప్పలి ఆంజనేయులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అమరచింతలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

అమరచింత : అమరచింత మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ అధినేత రాష్ట్ర సారథి పద్మశ్రీ మందకృష్ణ మాదిగలి వ్యవస్థాపకులు 32వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. MRPS రాష్ట్ర సారథి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కటింగ్ చేసి మిఠాయిలు తినిపించుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. .కార్యక్రమంలో మాట్లాడుతూ మాదిగలకు జరుగుతున్న అన్యాయాలను గురించి రావలసిన సదుపాయాలు, నిరుద్యోగ భృతిని, రానున్న రోజుల్లో మాదిగలు అగ్రస్థానంలో నిలిచేందుకు మాదిగ రిజర్వేషన్ల కోసం పోరాడి తీసుకొచ్చిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గొప్పతనాన్ని చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో అమరచింత మండలం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎస్.ఎం. అరుణ్ కుమార్ . గోపి . ప్రసన్న . సైమన్ . రాజు. రవికుమార్ . ప్రశాంత్ . ఉదయ్ . విజయ్ . రాజు. క్రాంతి .మధు, రవి .రాజు మేస్త్రి . షేర్ ఖాన్ . చిన్న . రాజు. శాంతి



వర్ధన్ . అశోక్ . ప్రవీణ్ . దిలీప్ . బాలు . కార్తీక్ . ఫ్రాంక్లిన్ . కవి రాజు. సునీల్ ఆనంద్ . ఎమ్మార్పీఎస్ అమరచింత మండలం వివిధ గ్రామాల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085